ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
గురువారం 30 అక్టోబరు 2025



ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 28.0
కనిష్ఠం : 24.0

ముంచిన.. మొంథా



ముసునూరు మండలం గుడిపాడులో నేలకు ఒరిగిన వరి చేను

- ఈదురుగాలులు.. భారీ వర్షాలు
- నేలవాలిన చెట్లు.. ఒరిగిన విద్యుత్ స్తంభాలు
- అంధకారంలో పలు గ్రామాలు .. దెబ్బతిన్న రహదారులు
- 9,298.64 హెక్టార్లలో వరి, మినుము, పత్తి, వేరుశనగ.. 33 హెక్టార్లలో అరటి, కూరగాయల పంటలకు నష్టం

ఏలూరుసిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ జిల్లాను అతలాకుతలం చేసింది. ఎక్కడికక్కడ చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మంగళవారం రాత్రి జిల్లాలోని పలు గ్రామాల్లో అంధకారం నెలకొంది. వరి, పత్తి, మినుము, వేరుశనగ పంటలతో పాటు ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. పెద ఎడ్లగాడి వద్ద కొల్లేరు వరద ఉధృతి కొనసాగుతోంది. జిల్లా యంత్రాగం చేపట్టిన ముందస్తు సహాయక కార్యక్రమాల వల్ల ఆస్తి, ప్రాణ నష్టాలను నివారించగలిగారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా మంత్రి కొలుసు పార్థసారధి, ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్‌లు, తుఫాన్ సహాయక చర్యల నిమిత్తం వచ్చిన జిల్లా ప్రత్యేక అధికారి కాంతిలాల్ దండే, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ అభిషేక్ గౌడ ఎప్పటికప్పుడు సహాయక చర్యలపై సమీక్షలు నిర్వహించారు. జిల్లాలో 90 తుఫాన్ సహాయక శిబిరాలు ఏర్పాటు చేసి 3,422 కుటుంబాలకు చెందిన ఏడు వేల మందికి భోజన, వసతి సదుపాయాలు కల్పించామన్నారు.



పెదపాడు మండలం వట్లూరులో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, కలెక్టర్ వెట్రిసెల్వి



దెందులూరులో ఈదురు గాలులకు విరిగిన అరటి తోట

ప్రతి రైతును ఆదుకుంటాం : మంత్రి మనోహర్

లోపలి పేజీలో..

9,298.64 హెక్టార్లలో పంట నష్టం

తుఫాన్ ప్రభావంతో జిల్లాలో 9,298.64 హెక్టార్లలో వరి, మినుము, వేరుశెనగ, పత్తి పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలో 26 మండలాల్లో 296 గ్రామాలు తుఫాన్ వల్ల ప్రభావితం అయ్యాయి. 10,916 మంది రైతులకు చెందిన పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ శాఖ నివేదికల ప్రకారం 6,763. 24 హెక్టార్లలో వరి, 1,551.2 హెక్టార్లలో మినుము, 67 హెక్టా ర్లలో వేరుశనగ, 917.2 హెక్టార్ల లో పత్తి పంటలు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న వరి పంట పొలాలను జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్ బాషా పరిశీలించారు. కాగా జిల్లాలో 33 హెక్టార్లలో ఉద్యాన పంటలకు 10 లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఏడు మండలాల్లోని 18 గ్రామాలు తుఫాన్‌కు ప్రభావితం కాగా ఆయా ప్రాంతాల్లో 30 హెక్టార్లలో అరటి తోటలు, 3 హెక్టార్లలో కూర గాయల తోటలు దెబ్బతిన్నాయి.

విద్యుత్ శాఖకు అపార నష్టం

మొంథా తుపాను కారణంగా విద్యుత్ శాఖకు అపార నష్టం వాటిల్లింది. జిల్లాలో 11 కేవీ ఫీడర్లు 20 వరకు దెబ్బతినగా, 33 కేవీకి చెందిన ఎనిమిది విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. ఎల్‌టీకి చెందిన 109 విద్యుత్ స్తంభాలు, 11 కేవీకి చెందిన 66 విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. జిల్లాలో 22 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. 11 కేవీ విద్యుత్ కండక్టర్లు 9.62 కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయి. మొత్తంగా జిల్లా లో విద్యుత్ శాఖకు రూ. 35.96 లక్షల వరకు నష్టం వాటిల్లింది. జిల్లాలో విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగవంతంగా జరిగాయని ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ పి.సాల్మన్‌రాజు తెలిపారు. జిల్లాలోని 144 విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో 82 చోట్ల 33 కేవీ ఫీడర్లు, 726 చోట్ల 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్‌ను సకాలంలో పునరుద్ధరించినట్టు వివరించారు.

ప్రాథమిక నష్టం అంచనాలను సమర్పించండి : కలెక్టర్

జిల్లాలో మొంథా తుఫాన్ కారణంగా కలిగిన ప్రాథమిక నష్టం అంచనాలను వెంటనే (మిగతా 8వ పేజీలో)

చివరి క్షణం వరకు ఉత్కంఠ

- తీరం దాటే సమయంలో ఊపిరి బిగబట్టిన జనం
- కంటి మీద కునుకు లేకుండా గడిపిన తీర గ్రామాలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

మొంథా తుపాను ముంచి వెళ్లింది. కాకినాడ వద్ద తీరం దాటుతుందని అంతా అంచనా వేశారు. చివరకు కోనసీమ-పశ్చిమ సరిహద్దుల్లో బియ్యపుతిప్ప వద్ద తీరం దాటనున్నట్టు రాష్ట్ర విపత్తుల సంస్థ ప్రకటించడంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా యంత్రాగమంతా హై అలర్ట్ అయ్యింది. ముందుజాగ్రత్త చర్యగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఇక తీరం దాటే సమయంలో జిల్లా ప్రజలు ఊపిరి బిగబట్టి ఉన్నారు. తీర గ్రామాల ప్రజల్లో కంటి మీద కునుకు లేదు. ఎంతటి విపత్తు తెస్తుందోనని అందోళనకు గురయ్యారు. ప్రతిక్షణం ఒక యుగంలా గడచింది. మంగళవారం రాత్రి 11.30 గంటలకు పూర్తిగా తీరం దాటుతుందని, ఆ సమయంలో తీవ్ర తుఫానుగా దాడి చేస్తున్న మొంథా ఎటువంటి అల్లకల్లోలం సృష్టిస్తుందోనని ఆందోళన చెందారు. సీఎం చంద్రబాబు రాత్రి వేళ పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. మంత్రి నిమ్మల రామానాయుడు తీరప్రాంతానికి చేరుకుని అక్కడ ప్రజల్లో ధైర్యాన్ని నింపే ప్రయత్నం చేశారు. రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖలన్నీ తీర ప్రాంతంలోనే గస్తీ ఉన్నాయి. అర్ధరాత్రి 12 గంటలు అయ్యింది. అంతా ప్రశాంతంగానే ఉంది. తుఫాన్ బియ్యపుతిప్ప సమీపంలోనే తీరం దాటిందా లేదా వేరొకచోట అన్న అనుమానం కలిగింది. తుఫా న్‌కు ముందు వర్షం, ఈదురు గాలులు వీచాయి. తీరం దాటే సమయంలో ఎటువంటి అలజడి లేక పోవడంతో గమనార్హం. మొత్తానికి అర్ధరాత్రి తర్వాత గండం గట్టెక్కిందని భావించారు. అధికారులంతా ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. కాని, రాత్రి మూడు గంటల సమయంలో కొన్ని ప్రాంతాల్లో ఒక్కసారి సుడిగాలి వీచింది. గాలుల బీభత్సంతో వరి చేలు నేలవాలాయి. తుఫాన్ తర్వాత నష్టం తక్కువగా ఉండడంతో హుటాహుటీన సహాయక చర్యలు చేపట్టారు.



ముదినేపల్లి మండలం వైవాకలో విరిగిన విద్యుత్ స్తంభాలు



పెదపాడు మండలం కొణికి పంచాయతీ కార్యాలయం సమీపంలో కూలిన చెట్టు



కొల్లేరు వరదకు నీట మునిగిన కైకలూరు మండలం గోకర్ణపురం-పైడిచింతపాడు రోడ్డు



కైకలూరు పునరావాస కేంద్రంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

కైకలూరు/మండవల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం తగ్గినప్పటికీ మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ అన్నారు. మండవల్లి మండలం భైరవపట్నం, కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న ప్రజలను బుధవారం కలిసి మాట్లాడారు. అల్పాహారాన్ని అందజేశారు. భోజనం, ఇతర వసతులపై ఆరా తీశారు. పోలీసు, రెవెన్యూ ఇతర శాఖల అధికారులు సమన్వయం వల్ల ఎక్కడా ప్రాణనష్టం కలుగలేదని, చెట్లు, కరెంటు స్తంభాలు విరిగిపడిన సిబ్బంది స్పందించి వాటిని తొలగించడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు కలగ లేదన్నారు. భైరవపట్నంలో నివసిస్తున్న పిట్టల్లోలతో మాట్లాడి అధికారుల సూచనల మేరకు పునరావాసా కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. టౌన్, రూరల్ సీఐలు ఏవీఎస్ రామకృష్ణ, వి.రవికుమార్, ఎస్‌ఐలు ఆర్.శ్రీను, వెంకట్‌కుమార్, రామచంద్రరావు పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలలు యథాతథం

ఏలూరు అర్బన్ : జిల్లాలో తుఫాన్ ప్రభావం తగ్గినందున అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు గురువారం నుంచి యథాతథంగా పూర్తిస్థాయిలో నిర్వహించాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. భవనంపై ఎక్కడైనా నీరు నిలిచిపోవడం, విద్యుత్ ప్రమాదం, గోడకూలే పరిస్థితి, విద్యార్థులకు ప్రమాదకర వాతావరణం ఉంటే విద్యాసంస్థను తాత్కాలికంగా మూసివేయాలని ఆదేశించారు.


చినలంక వంతెనకు గండి

ముంపులో 1,200 ఎకరాల్లో ఆక్వా చెరువులు.. రైతులకు భారీ నష్టం

నరసాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ పోతూ పోతూ బుధవారం రాత్రి చినలంక వంతెనకు గండి పెట్టింది. దీంతో ఒక్కసారిగా నల్లీ క్రిక్ నీరు పరిసర చెరువులను ముంచి వేసింది. కళ్ల ఎదుటే.. చేతికొచ్చిన ఆక్వా నీటి పాలు అవుతుంటే... రైతులు కన్నీరు కార్చారు. అయితే మరికొందరికి ఇది ఆనందం మిగిల్చింది. వలలతో కొట్టుకుపోతున్న రొయ్యలను పట్టుకుని సంచులు నింపుకున్నారు. చినలంక నుంచి సముద్రానికి వెళ్లే ఈ వంతెన ఇటీవల శిథిలావస్థకు చేరి అక్కడక్కడ గండిపడింది. వంతెన కొట్టుకుపోతే.. సముద్రానికి వేటాడేందుకు వెళ్లే మార్గం ఉండదని మత్స్యకారుల విజ్ఞప్తితో నేతలు కొత్త వంతెనకు నిధులు మంజూరు చేయించారు. పనులు ప్రారంభం కాకుండానే... పాత వంతెనకు గండిపడింది. ఒక్కసారిగా సముద్రంలోని నీరు ఉప్పుటేర్ల గుండా రావడంతో వంతెన రెండు ముక్కలైంది. దీంతో నల్లీ క్రిక్‌కు అనుకుని ఉన్న 1,200 ఎకరాల చెరువులు కొట్టుకుపోయాయి. అందులో వున్న రొయ్యలన్నీ నీటిపాలయ్యాయి. ఇది కొందరికి ఆనందాన్ని మిగిల్చింది. ఇళ్ల నుంచి వలలు తెచ్చుకుని అయినకాడికి వేటాడుకున్నారు. సమాచారం తెలిసిన వెంటనే కలెక్టర్ నాగరాణి, విఫ్ నాయకర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మత్స్యకార అభివృద్ధి చైర్మన్, ఇన్‌ఛార్జ్ పొత్తూరి రామరాజు, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి చిన్న గ్రామాన్ని సందర్శించారు. తక్షణం పనులు చేపడతామని హామీ ఇచ్చారు.



చినలంక వద్ద గండిని పరిశీలిస్తున్న పశ్చిమ కలెక్టర్ నాగరాణి



చొదిమెళ్లలో లే-అవుట్ (ఫైల్)

ఎల్‌ఆర్‌ఎస్‌కు పచ్చజెండా

- అనధికారిక లే-అవుట్ల రెగ్యులరైజేషన్
- వచ్చే ఏడాది జనవరి 23 వరకు గడువు పెంపు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

రియల్‌ఎస్టేట్ రంగంలోని యజమానులు, ప్లాట్ల ఓనర్లకు శుభవార్త. అనధికార లే-అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్)కు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ ఏడాది జూన్ 30వ తేదీని కటాఫ్‌గా తీసుకుంది. ఆ పరిధిలో ఉన్న వాటిని క్రమబద్ధీకరించేందుకు వచ్చే ఏడాది జనవరి 23 వరకు (మూడు నెలలు) గడువును పొడిగించింది. గతంలో ఎల్‌ఆర్‌ఎస్‌కు కటాఫ్‌గా 2020 డిసెంబరు 31వ తేదీతో ఇటీవల వరకు దరఖాస్తులను ఆహ్వానించారు. ఈ గడువు ఇటీవలే ముగియడంతో మరో మూడు నెలలు గడువును ప్రభుత్వం పొడిగించింది. జిల్లాలో ఇడా పరిధిలో ఉమ్మడి జిల్లాలోని 40 మండలాలతో పాటు ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఐదు మండలాల్లోని పంచాయతీలు లే-అవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఇప్పటి వరకు 3,935 దరఖాస్తులు అందినట్టు ఇడా అధికారులు తెలిపారు. ఏలూరు కార్పొరేషన్‌లో ఎల్‌ఆర్‌ఎస్‌కు 90కుగా పైగా దరఖాస్తులను అధికారులు పరిష్కరించాల్సి ఉంది. మిగతా మునిసిపాలిటీల్లోనూ వీటి సంఖ్య స్వల్పంగా ఉంటుందని చెబుతున్నారు. తాజాగా ఎల్‌ఆర్‌ఎస్‌కు అనుమతించడంతో రియల్‌ఎస్టేట్ రంగానికి మరింత ఊపు వచ్చే అవకాశం ఉంది.

ఐదేళ్లలోపు లే-అవుట్లకు బంపర్ ఆఫర్

కూటమి ప్రభుత్వం ఐదేళ్లలోపు లే-అవుట్లను క్రమబద్ధీకరించేందుకు యజమానులకు తాజాగా బంపర్ ఆఫర్ ఇచ్చినట్లే. 2020 డిసెంబరు 31వ తేదీతో ముగిసిన కటాఫ్ డేట్‌ను ఈ ఏడాది జూన్ నెలాఖరు వరకు పొడిగించారు. దీంతో అన్ని అనధికారిక లే-అవుట్లల్లో భాగంగా సబ్ డివిజన్ ఆఫ్ ప్లాట్స్, వెంచర్లు వేసిన భూమి యజమానులు, డెవలపర్స్, సంస్థలు, కంపెనీలు, సొసైటీలకు చెందిన వారు ఈ ఏడాది జూన్ 30వ తేదీలోగా రెగ్యులరైజేషన్‌కు రిజిస్టర్ చేసుకుని ఉండాలి. సేల్ డీడ్ ప్రాధాన్యతగా తీసుకుంటారు.

- అనధికార లే-అవుట్లలో ప్లాట్ ఉన్నవారు , లే-అవుట్లను అభివృద్ధి చేసిన యజమానులు , మునుపటి ఎల్‌ఆర్‌ఎస్ 2020లో దరఖాస్తు చేయని వారు ఎల్‌ఆర్‌ఎస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేయాలి. అవసరమైన డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయాలి.ఈ ఏడాది జూన్ 30 ముందు నాటి సెల్ఫ్ అటెస్టెడ్ డాక్యుమెంట్ సమర్పించాలి, ప్లాట్ సైజ్, భూమి విలువ ఆధారంగా ఛార్జీలు నిర్ణయిస్తారు. ఓపెన్ స్పేస్ లేనప్పుడు భూమి విలువపై 7 శాతం ఓపెన్ స్పేస్ ఛార్జీలు కట్టాలి. 45 రోజుల్లో మొత్తంగా చెల్లిస్తే 10 శాతం రాయితీ, 46 నుంచి 90 రోజుల్లో చెల్లిస్తే 5 శాతం రాయితీ (ఓపెన్ స్పేస్, సీఎల్‌యూ ఛార్జీలపై వర్తించదు) వర్తిస్తుంది. దరఖాస్తు చేసినప్పుడు కనీసం రూ.10 వేలు లేదా 50 శాతం ఛార్జీలు చెల్లించాలి.

ఉదాహరణకు పదెకరాల లే-అవుట్‌కు రిజిస్టర్ చేసుకుని రెండు ఎకరాలు లే-అవుట్ చేసుకోకపోతే వారు పెనాల్టీతో క్రమబద్ధీకరించుకోవచ్చు. ప్లాట్లకు (మిగతా 8వ పేజీలో)




ఆకివీడులో హైవేపై పడిన వృక్షం తొలగింపు చేస్తున్న సీఐ జగదీశ్వరరావు.. దెందులూరులో పడిన చెట్ల తొలగిస్తున్న సిబ్బంది



యలమంచిలిలో నీటమునిగిన వరి పంట




సీతారామపురం కాల్వగట్టు వద్ద పడిన భారీ చెట్టు.. పెనుగొండ మండలం కొరాలపర్రు వద్ద విరిగిపడిన తాటిచెట్టు

మొంథా విలయం

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావం కనిపించింది. ఈ మేరకు వరి పంటలు నేలవాలాయి. అరటితోటలు ధ్వంసమయ్యాయి. తాటిచెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. బుధవారం పలు చోట్ల పడిన చెట్ల తొలగింపు పనులు, విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు.



పోలవరం మండలం గుంజవరంలో తెగిపడిన విద్యుత్ తీగలు



దెందులూరులో పడిన అరటి తోట



కలవపూడి- మోడి రహదారిలో వాలిన స్తంభం



తణుకు- అజ్జరం కాలనీలో విరిగిన చెట్టు తొలగిస్తున్న సిబ్బంది



ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లిలో ధ్వంసమైన అరటి తోటల వద్ద రైతులు



నరసాపురం మండలం చినలంక నల్లీ క్రీక్ వద్ద ఆక్వా చెరువులు మునిగి పోవడంతో వలలు వేసి రొయ్యల వేట సాగిస్తున్న మత్స్యకారులు



ఆచంటలో పడిపోయిన పంట పొలాలను పరిశీలిస్తున్న అధికారులు



ఉండి సివిల్ సప్లయిస్ గోడౌన్ స్టోర్‌పై కూలిన చెట్టు



నరసాపురం మండలం సీతారామపురం కాల్వగట్టు వెంబడి వున్న గుడిసెపై పడిన భారీ చెట్టు



పెనుగొండ మండలం కొరాలపర్రులో నేల వాలిన వరి చేలు

పునరావాసాలు భేష్

పనితీరుపై నిర్వాసితులు సంతృప్తి

పిల్లలకు పాలు, వైద్యం, మంచి ఆహారం



పీఎంలంక పునరావాస కేంద్రంలో భోజనాలు

నరసాపురం రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ బీభత్సానికి ప్రాణనష్టం జరగకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాసాలను నిర్వసితులు కితాబులు కురిపిస్తున్నారు. మూడు రోజుల పాటు మంచి సౌకర్యాలు అందించారని అధికారుల్ని ప్రశంసిస్తున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఎక్కువ మందిని పునరావాస కేంద్రాలకు తరలించినప్పటికి ఎవరికి ఎటువంటి లోటు రాకుండా సౌకర్యాలు కల్పించడంలో అధికార యంత్రాంగం సఫలీకృతమైంది. నరసాపురం, మొగల్తూరు మండలంలో 19 కేంద్రాలు ఏర్పాటు చేసి సుమారు పది వేల మందిని తరలించారు. అందులో అత్యధికంగా పీఎంలంక గ్రామంలో రెండు వేల మంది తలదాచుకున్నారు. అన్ని కేంద్రాల్లో ఉదయం అల్పాహారం, టీతో పాటు మధ్యాహ్నం, సాయంత్రం భోజనం కల్పించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. గర్భిణులు, వృద్ధుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. పిల్లలకు పాలు అందించారు. అన్ని కేంద్రాల్లో మంచినీరుతో పాటు జనరేటర్ ఏర్పాటు చేసి విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూశారు. ఒక్కొక్క కేంద్రం వద్ద ఒక్కో మండల అధికారికి బాధ్యతలు అప్పగించారు. బుధవారం సాయంత్రంతో వీటిని మూసివేశారు.

ప్రత్యేక శ్రద్ధ చూపారు..



గతంలో అనేక మార్లు పునరావాస కేంద్రాలకు వచ్చాం. కానీ ఎప్పుడు ఇలా చూడలేదు. ఈసారి ప్రత్యేక శ్రద్ధ చూపించారు. మంచి ఆహారంతో పాటు మందులు అందించారు. ఇక్కడికి రావడం వల్ల భయం పోయి.. నలుగురితో కలిసి ఉన్నాం.

- తిరుమాని నాగలక్ష్మి, పీఎంలంక, నరసాపురం



పునరావాస కేంద్రంలో భోజనం వడ్డిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు

ధర్మాజీగూడెం పునరావాస కేంద్రంలో
డిప్యూటీ కమిషనర్ పరిశీలన

లింగపాలెం, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి):పునరావాస కేంద్రాలలో రుచికరమైన భోజనాన్ని, నిరంతరం మంచినీటిని అందించాలని, చిన్నారులకు పాలు అందించాలని ఏలూరు జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్(స్పెషల్ ఆఫీసర్) పి.శ్రీనివాసరావు అన్నారు. లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెంలోని పునరావాస కేంద్రాన్ని తహసీల్దార్ నజీముల్లాషాతో కలిసి ఆయన పరిశీలించారు. పునరావాసంలో ఆశ్రయం పొందుతున్న వారిని పలకరించి వారికి అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఇంకా వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం ఉదయం అల్పాహారం ముగిసిన తరువాత పునరావాసం నుంచి ఇళ్లకు వెళతారని తెలిపారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

ప్రతి రైతును ఆదుకుంటాం

3,422 మందిని పునరావాసానికి తరలించాం ▸ నేటిలోగా నష్టాలపై నివేదిక ఇవ్వండి : ఏలూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి మనోహర్

ఏలూరు/పెదపాడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):'జిల్లాలో మొంథా తుఫాన్ నేపథ్యంలో 90 పునరావాస కేంద్రాలకు 3,422 మంది తరలించి సహాయక చర్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాం. జిల్లా యంత్రాంగం తీసుకున్న ముందస్తు చర్యలు వల్ల తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నాం. విపత్తు నివారణకు యంత్రాంగం మనస్సు పెట్టి చేసింది' అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఏలూరు జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలపై బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని 408 గ్రామ, వార్డు సచివాలయాల్లోని సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని ముందస్తు చర్యలు తీసుకుందన్నారు. తుఫాన్ బాధితులు సహాయ కేంద్రం నుంచి వెళ్లే సమయంలో కుటుంబానికి 25 కేజీల బియ్యం, కందిపప్పు, పంచదార, వంటనూనె, రెండు రకాల కూరగాయలు కిలో చొప్పున అందిస్తామన్నారు. చేనేత కార్మికులు, మత్స్యకార కుటుంబాలకు అదనంగా 25 కేజీల బియ్యం అందిస్తామన్నారు.

నష్టాలపై నివేదిక అందించండి..

జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధకశాఖ, ఆక్వా రంగానికి కలిగిన నష్టాలపై ఈనెల 30 తేదీలోగా నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించామన్నారు. సమావేశంలో కలెక్టర్ కె.వెట్రి సెల్వి, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆర్టీసీ చైర్మన్ రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఏపూరు పునరావాస కేంద్రం సందర్శన..

పెదపాడు మండలం ఏపూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి బుధవారం ఆయన సందర్శించారు. ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ శివారు ప్రాంతాల్లో రేకులషెడ్లు, పూరిపాకల్లో నివసిస్తున్న 32 కుటుంబాలకు చెందిన 96 మందిని పునరావాస కేంద్రానికి తరలించి వసతి, భోజన ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం పునరావాస కేంద్రాల నుంచి తిరిగి ఇంటికి వెళ్లే కుటుంబాలకు 25 కేజీలు బియ్యం, నిత్యావసర సరుకులు, బాధిత మనిషికి రూ.వెయ్యి, కుటుంబానికి రూ.3 వేలు చొప్పున నగదు పరిహారాన్ని అందజేశారు. ఆర్డీవో అచ్యుత అంబరీష్, డీఎస్‌వో ఈబీ విలియమ్స్, జిల్లా వ్యవసాయశాఖ జేడీ షేక్ హబీబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.



ఏపూరులో బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యేలు చింతమనేని, పత్సమట్ల, కలెక్టర్ వెట్రిసెల్వి తదితరులు

రైతులందరిని ఆదుకుంటాం

తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులందరిని ప్రభుత్వపరంగా అన్నివిధాలుగా ఆదుకుంటామని ఇన్‌చార్జి మంత్రి మనోహర్ తెలిపారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన పంటలను పెదపాడు మండలం వట్లూరులో బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులు వరిదుబ్బులను చూపించి, తమ బాధలను వ్యక్తం చేసి ఆదుకోవాలని కోరారు. మంత్రి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు.

అధికారులతో మంత్రి మనోహర్ సమీక్ష

ఏలూరు సిటీ : ఏలూరు జిల్లాలో నిర్వహించిన తుఫాన్ సహాయక కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి, తుఫాను సహాయక కార్యక్రమాల జిల్లా ప్రత్యేకాధికారి కాంతిలాల్ దండే, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభు త్వ యంత్రాంగం తీసుకున్న ముందస్తు జాగ్రత్త చర్యలతో మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోగలిగామన్నారు. జిల్లా మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీ నేతలు క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారని, వీటిని అధికారులు పరి ష్కరించడంతో నష్టాన్ని నివారించగలిగామన్నారు. జిల్లా ప్రత్యేకాధికారి కాంతిలాల్ దండే మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం ముందస్తు జాగ్రత్తలతో నష్టాలను తగ్గించగలిగామని అధికారులను అభినందించారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మంత్రులు, ప్రజాప్రతినిధులు, తుఫాన్ ప్రత్యేకాధికారులు అందించిన సూచనలతో తుఫాన్‌కు ముందుగానే ప్రజలను సహాయక కేంద్రాలకు తరలించడంతో ప్రాణనష్టం సంభవించలేదన్నారు.




వాంద్రంలంకలో వరి దుబ్బులను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్, కలెక్టర్

రైతులకు అండగా నిలుస్తాం

▸ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

ఉండి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):రైతులకు అండగా నిలుస్తామని రానున్న రెండు మాసాలలో డ్రెయిన్లు, కాలువలు, ఇతర ఆక్రమణలను తొలగించి నీటిపారుదల మెరుగుగా ఉండేలా చర్యలు తీసుకుంటామని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు అన్నారు. ఉండి మండలం వాంద్రంలంకలో తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న వరిచేలను బుధవారం కలెక్టరు నాగరాణితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో 80 శాతం మేర డ్రెయిన్లు, కాలువలపై ఆక్రమణలను తొలగించి నీటిపారుదల వ్యవస్థను స్థిరీకరించామన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కులమతాలకు అతీతంగా ఆక్రమణలు తొలగిస్తామన్నారు. కౌలు రైతులకు సీసీఏ కార్డుల మంజూరులో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకునేందుకు వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గ్రామంలోని 900 ఎకరాలకు గాను 50ఎకరాల వరి పంట నేలకొరిగిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పాలకోడేరు బ్యాంక్ చైర్మన్ కొత్తపల్లి నాగరాజు, సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ, తోట ఫణిబాబు, కందుల బలరాం, కరిమెరక నాగరాజు, కాగితబుజ్జి, అప్పల కృష్ణ, సూరవరపు వెంకటాచార్యులు, జిల్లా వ్యవసాయాధికారి జడ్.వెంకటేశ్వర్లు, తహసీల్దార్ నాగార్జున, ఏడీఏ జీవన్ ప్రతాప్, ఏవో శ్రీనివాస్, వీఆర్వో చిన్నారావు, గ్రామ కార్యదర్శి నాయుడు పాల్గొన్నారు.

పెరిగిన ఉప్పుటేరు నీటిమట్టం



ఆకివీడు వద్దఉధృతంగా ప్రవహిస్తున్న ఉప్పుటేరు

ఆకివీడు రూరల్/తణుకు రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కొల్లేరులోని నీటిని సముద్రంలోకి తీసుకెళ్లే ఏలూరు-పశ్చిమ గోదావరి జిల్లాల మధ్య వున్న ఉప్పుటేరులో నీటి మట్టం పెరిగింది. వంతెన వద్ద వున్న సూచికలో 1.90 మీటర్లుగా నమోదైంది. తుఫాన్ ప్రభావంతో ఉప్పుటేరులో నీటి ప్రవాహం తక్కువగా ఉంది. గురువారానికి అవుట్ ఫ్లో పెరిగి నీటిమట్టం త్వరగా తగ్గుతుందని డ్రెయినేజి ఏఈ ప్రసాద్ తెలిపారు. ఉప్పుటేరు బ్యాక్ వాటర్ వల్ల సిద్దాపురం, మాదివాడ, అగ్రహారం, చినిమిల్లిపాడు గ్రామాల వరి పొలాలకు ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

వయ్యేరులో అదే ఉధృతి

భారీ వర్షాల కారణంగా తణుకు రూరల్ మండలం దువ్వ వయ్యేరుకు వరద నీరు చేరడంతో ప్రవాహం ఉధృతంగా వుంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీరు పలు జలాశయాలలో చేరి ఎర్ర కాలువకు, అక్కడి నుంచి దువ్వ వయ్యేరులోకి వస్తోంది. దీని నుంచి యనమదుర్రు డ్రెయిన్ ద్వారా సముద్రంలోకి వెళుతుంది. దువ్వ వయ్యేరు గట్టుపై నివసించే సంచార ప్రజలను స్థానిక పునరావాస కేంద్రానికి తరలించారు.



దువ్వలో ఉధృతంగా ప్రవహిస్తున్న వయ్యేరు

బోధనాసుపత్రుల్లో ఉచిత వైద్యచికిత్సలు కొనసాగింపు



ఆశ్రంలో ఉచిత వైద్యసేవలను పరిశీలిస్తున్న డాక్టర్ రాజీవ్

ఏలూరు అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): బకాయిలు చెల్లించాలంటూ ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆసుపత్రులు గతకొన్ని రోజులుగా ఉచిత వైద్యచికిత్సలను నిలిపివేసిన నేపథ్యంలో ఆయా ప్రైవేటు ఆసుప త్రుల్లో రోగులకు అందుతున్న వైద్యసేవలను బుధవారం ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్ పరిశీలించారు. ఏలూరు ఆశ్రం వైద్యకళాశాల బోధనాసుపత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవకింద ఇన్‌పేషెంట్లుగా చేరిన రోగులతో ఆయన మాట్లాడారు. మొంథా తుఫాన్ ప్రభావంతో ఏర్పడిన పరిస్థితుల నేపథ్యంలో ఉచిత వైద్యచికిత్సలను నిలిపివేయాలనే ఆలోచనను తాత్కాలికంగా విరమించుకున్నామని వైద్యకళాశాల యాజమాన్యం తెలియజేసిందన్నారు. తుఫాన్ కారణంగా మానవతాదృక్పథంతో మిగిలిన నెట్‌వర్క్ ఆసుపత్రులు కూడా ఉచిత వైద్యచికిత్సలను అందించాలని కోరుతున్నామన్నారు. ఆ మేరకు ఏలూరులోని మూడు నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలను గురువారం కలిసి అభ్యర్థిస్తామన్నారు. ఉచిత వైద్యచికిత్సలను నిలిపివేసినప్పటికీ సంబంధిత ఆసుపత్రులకు వచ్చే రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు నేతృత్వంలో ప్రత్యామ్నాయ ఆసుపత్రులకు తీసుకెళ్లేందుకు వీలుగా అంబులెన్సులు, వైద్యమిత్రలను అందుబాటులో ఉంచామన్నారు.

నరసాపురం డీఎస్పీ శ్రీవేదకు అరుదైన గౌరవం

» 31న గుజరాత్‌లో పోలీస్ పరేడ్‌కు నాయకత్వం



డాక్టర్ శ్రీవేద

నరసాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నరసాపురం డీఎస్పీ డాక్టర్ శ్రీవేదకు అరుదైన గౌరవం దక్కింది. గుజరాత్‌లోని కేవాడీ వద్ద ఈనెల 31న నిర్వహించే పోలీస్ పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ పోలీస్ బృందం డీఎస్పీ శ్రీవేద నాయకత్వం వహించనున్నారు. సర్దార్ జయంతిని పురస్కరించుకుని ఏకతా దివాస్ పరేడ్‌ను కేంద్రం నిర్వహిస్తుంది. దీనికి అన్ని రాష్ట్రాల నుంచి పోలీస్ బృందాలు శిక్షణకు తరలివెళ్లాయి. రాష్ట్రం నుంచి పోలీస్‌లు, అధికారులు వెళ్లి శిక్షణ పొందుతున్నారు. డీఎస్పీ శ్రీవేద గత కొద్దిరోజుల నుంచి అక్కడే ఉండి శిక్షణ పొందుతున్నారు. ఆమె చూపిన ప్రతిభను గుర్తించిన ఉన్నతాధికారులు ఏపీ పోలీస్ పరేడ్‌ను లీడ్ చేసే బాధ్యతల్ని అప్పగించారు. ఏడాది క్రితమే డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆమె స్వల్పకాలంలో ఈ అరుదైన గౌరవాన్ని దక్కించుకోవడంపై పోలీస్ అధికారులు అభినందనలు వ్యక్తం చేశారు.

'విద్యార్థులు సాంకేతిక రంగాల్లో రాణించాలి'



జ్యోతి ప్రజ్వలనలో అతిథులు, ఆచార్యులు

తాడేపల్లిగూడెం అర్బన్, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక రంగాల్లో పట్టు సాధించాలని మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ ఫార్మర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వివేకానంద అన్నారు. తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో బుధవారం జ్యోతి ప్రజ్వలన చేసి టెడ్ ఎక్స్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశలను అవకాశాలుగా మార్చుకునే సాధనమే ఆధునిక టెక్నాలజీ అన్నారు. అనంతరం సీఈవో అవినాశ్ మాట్లాడారు. ఎలికో హెల్త్ సర్వీస్ ఎండీ డాక్టర్ వనిత, ఐఐటీ ఆచార్యులు డాక్టర్ పట్టాభిరామన్ ఆన్‌లైన్ ద్వారా మాట్లాడారు. అనంతరం అతిథులను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కో-ఆర్డినేటర్‌గా అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వరెడ్డి ఆర్గనైజర్‌గా వయ్యావుల కృష్ణప్రియ, కో-ఆర్గనైజర్‌గా వేందాతరెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్ లు, ఆచార్యులు పాల్గొన్నారు.

పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ ఈఈల సీనియారిటీ జాబితా

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల సీనియారిటీ జాబితాను ప్రకటిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల సీనియారిటీ జాబితాను తయారుచేసి ఇప్పటికే ఆయా ఇంజనీర్ల నుంచి అభ్యంతరాలను స్వీకరించి తుది జాబితాను ఇంజనీర్-ఇన్-చీఫ్ రూపొందించారు. ఈ సీనియారిటీ జాబితాను ఆమోదించేందుకు ప్రభుత్వ అనుమతిని కోరగా ఆ మేరకు మున్సిపల్ శాఖ 48 మందితో కూడిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల సీనియారిటీ జాబితాకు ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీచేసింది.

విద్యార్థులకు లెటర్ రైటింగ్ పోటీలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో లెటర్ రైటింగ్‌ను ప్రోత్సహించే లక్ష్యంలో భాగంగా ధాయ్ ఆఖర్ లెటర్ రైటింగ్ పోటీ-2025ని నిర్వహిస్తున్నట్టు ఏలూరు డివిజన్ పోస్టాఫీసుల సూపరింటెండెంట్ ఎస్.శ్రీకర్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. 'లెటర్ టు మై రోల్‌మోడల్' అనే అంశంపై నిర్వహించే పోటీని 18ఏళ్లలోపు, అంతకుపైబడిన వయస్సు విద్యార్థులకు రెండువిభాగాల్లో రాష్ట్ర, జాతీయస్థాయిల్లో పోటీలు డిసెంబరు ఎనిమిదో తేదీ వరకు జరుగుతాయన్నారు. విద్యార్థులు రూ.5 ఎన్వలప్ కవర్ కేటగిరీ కింద వెయ్యి పదాలకు మించకుండా ఏ-4 సైజు కాగితంపై లేదా రూ2.50 పైసల ఇన్‌ల్యాండ్ లెటర్ కేటగిరీ కింద 500 పదాలకు మించ కుండా లేఖనురాసి నిర్ణీత గడువుతేదీలోగా పంపాలని సూచించారు. చేతితో రాసిన లేఖలు మాత్రమే పంపాలని, ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు లేదా అంతకుపైబడి వున్నట్టుగా ధ్రువీకరిస్తూ స్పష్టంగా రాయాలని కోరారు. పోటీకి అవసరమైన స్టేషనరీ అన్ని పోస్టాఫీసుల్లో అందుబాటులో ఉంచామన్నారు. లేఖలను సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, ఏలూరు డివిజన్, ఏలూరు-534007 చిరునామాకు పంపాలని సూచించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో తొలి మూడుస్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులు అందిస్తారన్నారు.

లక్ష్మీ గణపతికి అరటి పండ్లతో అర్చన



ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండో బుధవారం పురస్కరించుకుని సత్రంపాడులోని దేవదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీగణపతి స్వామి ఆలయం వద్ద భక్తులు స్వామికి అరటిపండ్లతో అర్చనలు జరిపారు. అర్చకులు స్వామికి పంచామృతాభిషేకం జరిపి ప్రత్యేక అలంకరణలో భక్తజనానికి దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారి సన్నిధిలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించి ఆరాధించారు.



ఆకివీడులో నిలిచిన ట్రాఫిక్ (ఫైల్)



నిత్యం రద్దీగా ఉంటున్న ఆచంట కచేరి సెంటర్ (ఫైల్)

చక్రబంధం

ఆకివీడులో ట్రాఫిక్ సమస్య రానురాను తీవ్రమవుతోంది. ఆకివీడు మీదుగా వెళ్లే వాహనాలు సంఖ్య గణనీయంగా పెరిగింది. పేరుకు జాతీయ రహదారి అయినా పట్టణ పరిధిలో కుంచించుకుపోయి కనీసం రెండు వాహనాలు తప్పుకొనే పరిస్థితి లేదు. ఒక పక్క రహదారి విస్తరణకు నోచుకోకపోవడం, మరో పక్క రోడ్డు ఆక్రమణలు సమస్యకు కారణం అవుతున్నాయి.

(ఆకివీడు-ఆంధ్రజ్యోతి)

» ఆకివీడులో వాహనాల రద్దీ
» యథేచ్ఛగా పార్కింగ్, ఆక్రమణలు
» ట్రాఫిక్ వెతలతో ప్రజల పాట్లు
» రహదారి విస్తరించాలని వినతి

ఆకివీడులో ట్రాఫిక్ సమస్య పరిష్కరించే దిశగా వెంకయ్యవయ్యేరు గట్టు వెంబడి ఉన్న రెండు కిలో మీటర్ల మినీ బైపాస్ రోడ్డు గత టీడీపీ ప్రభుత్వంలో కొంతమేర రూ.1.50 కోట్లతో నిర్మాణం పనులు పూర్తి చేశారు. మిగిలిన ఉన్న రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో ఈ రోడ్డును పూర్తిస్థాయిలో వినియోగించడం మానేశారు. అయి తే ఇటీవల డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తాత్కాలిక చర్యలు చేపట్టడంతో ట్రాఫిక్‌ను నివారించేందుకు పోలీసులు ఈ రోడ్డు గుండా వాహనాలు కొన్ని రోజులు మళ్లించి వదిలేశారు. ఉదయం సాయంత్రం పాఠశాలలు, కళాశాలల బస్సులు, హైదరాబాద్, బెంగుళూరు బస్సులు రాకపోకలు, ఊక లారీలు, ధాన్యం, బియ్యం లోడు లారీలు, దుకాణాలకు వచ్చిన సరుకుల లారీలు రహదారిపైనే ఉంచి ఎగుమతులు, దిగుమతులు చేయడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

అవరోధాలు తొలగించాలి

నగర పంచాయతీ పరిధిలో ప్రధానంగా గుమ్ములూరు సెంటర్, మాదివాడ నుంచి ఎఫ్‌సీఐ వరకూ ఉన్న రహదారి మార్జిన్లు ఖాళీ చేయించాలి. తోపుడు బండ్లు, ఆటోలు, ఇతర వాహనాలతో ఆయా ప్రాంతాలు ఇరుకుగా మారుతుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాణిజ్య సంస్థలకు సంబంధించి ఏర్పాటుచేసిన బోర్డులు, ఎండ నుంచి రక్షణకు ఏర్పాటు చేసుకున్న సన్‌షెడ్‌లు తొలగించాలి.

రహదారి విస్తరణ ముఖ్యం

పట్టణ పరిధిలో 165 జాతీయ రహదారి విస్తరించకపోవడంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కష్టతరంగా మారుతోంది. ఈలోగా మినీ బైపాస్ రోడ్‌ను వినియోగించుకుంటే కొంతమేర ఉపయోగంగా ఉంటుంది. పట్టణంలో ఆక్రమణలు తొలగించి పార్కింగ్ సదుపాయం కల్పిస్తే మరి కొంత ట్రాఫిక్‌ను నివారించవచ్చు. నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై చర్యలు తీసుకోవాలి. జాతీయ రహదారి విస్తరణ జరగకపోతే తరచూ ప్రమాదాలు తప్పవు.

ఆచంట కచేరి సెంటర్‌కు మోక్షమెప్పుడో..

నిత్యం వాహనాల రద్దీ.. పట్టించుకోని అధికారులు

ఆచంట: ఆచంట కచేరి సెంటర్ నుంచి అనేక వాహనాలు మార్టేరు, సిద్ధాంతం, పాలకొల్లు వైపు నిత్యం వెళుతుంటాయి. ఈ సెంటర్‌లో ఒక్క వాహనం ఆగినా పదుల సంఖ్యలో వాహనాలు నిలిచి ట్రాఫిక్ జామై వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిరంతరం రద్దీ ఉన్నప్పటికీ ఏ అధికారి పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ట్రాఫిక్ పోలీస్ కనిపించరు. గతంలో రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోవడంతో మరింత రద్దీ ఏర్పడింది. అధికారులు స్పందించాలి మరి!

రహదారి విస్తరించాలి



పీక్ సమయంలో జనం నరకం చూస్తున్నారు. వాహనాలు తప్పించలేక ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. గంటల కొద్దీ ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంటున్నారు. అత్యవసరంగా రోగులను తరలించాల్సి వస్తే అంతే సంగతులు.

-దాసరి బాలకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్, ఆకివీడు

ఫోర్ లైన్స్‌గా చేయాలి



జాతీయ రహదారిని ఫోర్ లైన్స్‌గా విస్తరించాలి. రహదారికిరువైపుల ఆక్రమణల వల్ల తరచూ ట్రాఫిక్ నిలవడడమే కాక ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారికి మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ పోలీసులను నియమించాలి.

-డీవీ రమణమూర్తి, సాంఘిక న్యాయవేదిక కన్వీనర్, ఆకివీడు

ట్రాఫిక్ నియంత్రిస్తాం..



ట్రాఫిక్ నివారణకు చర్యలు చేపడుతున్నాం. జాతీయ రహదారికి ఇరువైపుల ఆక్రమణలు తొలగింపుకు కృషి చేస్తున్నాం. దుకాణాల దగ్గర వాహనాలు నిలపడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. పార్కింగ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నాం.ప్రజానీకం స హకరించాలి.

-జి.కృష్ణమోహన్, నగర పంచాయతీ కమిషనర్, ఆకివీడు

సమస్య పరిష్కరిస్తాం..



ఆకివీడు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నాం. జాతీయ రహదారిపై భారీ వాహనాల సంఖ్య పెరిగింది. మినీ బైపాస్ రోడ్డు గుండా వాహనాలు మళ్లించేందుకు చర్యలు చేపట్టాం. ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకున్నాం.

-హనుమంతు నాగరాజు, ఎస్ఐ, ఆకివీడు

తుఫాన్ దెబ్బకు కూరగాయల ధరలకు రెక్కలు

» వంగ కిలో రూ. 100.. » బెండ రూ. 80



తాడేపల్లిగూడెం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ఎఫెక్ట్‌తో కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. తుఫాన్ ప్రభావంతో పాటు కార్తీక మాసం కారణంగా ధరలు బాగా పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కూరగాయలు మార్కెట్‌కు రావడం తగ్గింది. వాతావరణం మార్పులతో కూరగాయలు దిగుబడి కూడా తగ్గింది. ఇదే సమయంలో కూరగాయలకు డిమాండ్ ఏర్పడటంతో వ్యాపారులు ధరలను పెంచేశారు. గత వారం కిలో రూ.50 ఉండే బీర ఇప్పుడు రూ. 80కు చేరింది. రెండు వారాల కిందట రూ.20 అంటే కొనుగోలు చేయని బెండ ఇప్పుడు రూ.80కు చేరింది. దొండ, దోస కిలో రూ.60కు విక్రయిస్తున్నారు. కాకర రూ.60, బంగాళా దుంపలు రూ.50, వంకాయలు కిలో రూ.100 మార్కుకు చేరింది. టమాటా రూ.50, చిక్కుళ్లు రూ.130, క్యారెట్ రూ.80, బీట్‌రూట్ రూ.80 అమ్మారు. వీటి ధరలను చూసి ఒక కిలో తీసుకెళ్లేవారు అర కిలో, పావు కిలోలకే పరిమితమయ్యారు.

ఉల్లి ధరా పెరిగింది..

ఉల్లి ధర కిలోకు రూ.5 వంతున పెరిగింది. మొన్నటి వరకు మధ్యరకం ఉల్లి కిలో రూ. 20కు రిటైల్‌గా అమ్మేవారు. ఇప్పుడు కిలో రూ.25కు పెరిగింది. పెద్దసైజు ఉల్లి రూ.100కు 3కిలోలు వంతున అమ్మారు. వర్షాలకు మహారాష్ట్ర ఉల్లి తక్కువగా రావడంతో ధర పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పటికే కర్నూలు, కడప నుంచి ఉల్లి రావడం ఆగింది. ఇక పెద్ద దిక్కుగా ఉన్న మహారాష్ట్ర ఉల్లిపైనే అందరూ ఆధారపడ్డారు. మొన్న వారం మార్కెట్లోకి నాఫెడ్ నుంచి ఉల్లి వచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌కు రావడం తగ్గింది. బుధవారం తాడేపల్లిగూడెం మార్కెట్‌కు నాఫెడ్ నుంచి 2 లారీల్లో సుమారు 60 టన్నుల ఉల్లి వచ్చింది. క్వింటా రూ.1400 నుంచి 1500 మధ్య హోల్‌సేల్‌గా విక్రయించారు. ఇక మహారాష్ట్ర నుంచి కేవలం ఒక్క లారీలో సుమారు 30 టన్నులు వచ్చింది. హోల్‌సేల్‌గా క్వింటాలు రూ.2000 నుంచి రూ.2300కు అమ్మారు.



ఏలూరులో ఉద్యోగుల నిరసన

చిత్తూరులో అధికారి దురుసు ప్రవర్తనపై నిరసన

ఏలూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): చిత్తూరు వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ్ రెడ్డి కింద స్థాయి ఉద్యోగులపై దురుసుగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ నగరంలోని పెరుగుచెట్టు సెంటర్‌లో వాణిజ్య పన్నులశాఖ ఏసీ-2 కార్యాలయం వద్ద బుధవారం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఉద్యోగులను కించ పర్చే విధానాన్ని అధికారులు విడనాడాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఉద్యోగులు ముక్తకంఠంతో కోరారు. అధికారులు, సిబ్బంది కలిసి పనిచేసి శాఖకు మంచి పేరు తేవాలని నాయకులు హితవు పలికారు. ఏపీ వాణిజ్య పన్నుల శాఖ డివిజన్ ఉపాధ్యక్షులు కె చిట్టిబాబు, జాయింట్ సెక్రటరీలు గెద్దాడ జాన్‌బాబు, కిషోర్ బాబు, ప్రసాద్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విషం తాగి.. నిన్న భార్య, ఈ రోజు భర్త మృతి



పూర్ణిమ, సుధాకర్(ఫైల్)

భీమడోలు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో మనస్థాపానికి గురై విషం తాగిన భార్యాభర్తలు రోజు వ్యవధిలో ఇద్దరూ మృతి చెందారు.మంగళవారం భానుపూర్ణిమ మృతి చెందగా బుధవారం తెల్లవారు జామున చికిత్స పొందుతూ భర్త గుండుమోలు సుధాకర్ మృతి చెందాడు. భీమడోలుకు చెందిన గుండుమోలు సుధాకర్, భాను పూర్ణిమ ప్రేమించి పెళ్లి చేసుకోగా వారికి మూడేళ్ల బాబు ఉన్నాడు. అయితే భాను పూర్ణిమ మరొకరి ప్రేమించి వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో కుటుంబంలో కలతలు చెల రేగాయి. ఈ నేపథ్యంలో భార్య, భర్తలు భాను పూర్ణిమ, సుధాకర్‌లు విషం తాగడంతో గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించిన సంగతి తెలిసిందే. నేపథ్యంలో మంగళవారం ఉదయం భాను పూర్ణిమ చికిత్స పొందుతూ మృతి చెందగా భర్త సుధాకర్ బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి స్వగ్రామాలకు తరలించారు. దీంతో వారి కుటుంబాల్లో విషాదం అలుముకుంది. ఇదిలా ఉంటే భార్య భాను పూర్ణిమ వాగ్మూలం అనంతరం వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్న నిందితుడు కఠారి మోహన్‌ను ఇప్పటికే రిమాండ్‌కు తరలించారు.

చోరీ కేసులో తల్లీకొడుకుల అరెస్ట్

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నమ్మించి చేతిలో ఉన్న బ్యాగ్‌ను దొంగిలించిన ఇద్దరు తల్లీకొడుకులను రూరల్ సీఐ బి.బి.రవికుమార్ అరెస్ట్ చేశారు. తాడేపల్లిగూడెం తాళ్ల ముదునూరుపాడుకు చెందిన రావూరి ఉమామహేశ్వరరావు ఈ నెల 28న లారీ కొనుగోలు నిమిత్తం తన ఇంట్లోని 146 గ్రాముల బంగారం ఒక బ్యాగ్‌లో పెట్టుకుని పక్క పోర్షన్‌లో అద్దెకు ఉంటున్న కడప జిల్లా మైదుకూరుకు చెందిన ఆకెళ్ల మణికుమార్ అలియాస్ కుమారస్వామి అతని తల్లి లక్ష్మి కాంతంలను లారీ కొనేందుకు ముహూర్తం చూడాలని కోరారు. అయితే వాస్తుకూడా చూస్తామని నమ్మించి వెంట వెళ్లారు. అయితే ఆరుగొలనులో తన పెద్దమ్మ ఇంటి వద్ద కొంత డబ్బు తీసుకుందామని కారులో వెళ్లారు. కారులో ఉన్న మణి కుమార్, తల్లి లక్ష్మీకాంతం బంగారంతో ఉన్న బ్యాగ్ పట్టుకుని పరారయ్యారు. దీంతో ఉమామహేశ్వరరావు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ ఆదేశాల మేరకు డీఎస్పీ విశ్వనాథ్ సూచనలతో సీఐ రవికుమార్, సిబ్బంది చాకచక్యంగా తాడేపల్లిగూడెంలోని తణుకు వైపు బస్టాండ్ వద్ద నిందితులను పట్టుకుని అరెస్ట్ చేశారు. వేగంగా కేసు దర్యాప్తు చేసి నిందితులను పట్టుకోవడమే కాక బంగారం రికవరీ చేయడంపై సీఐ రవి కుమార్, హెడ్ కానిస్టేబుల్ అనిల్ కుమార్,కానిస్టేబుల్స్ మోహన్, పోలిరాజులను ఎస్పీ అభినందించారు.

వృద్ధులపై దాడి.. కేసు నమోదు

ఏలూరు క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వృద్ధులు నివసిస్తున్న ఇంటిపై కొంతమంది దాడి చేసి నిర్బంధించి ఇంటిసామగ్రి బయట పడేసి దౌర్జన్యం చేసిన ఘటనపై ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరు పత్తేబాద మంచినీళ్ల తోటలో నివాసం ఉంటున్న మూలా నాగిరెడ్డి(65) ఆయన భార్య సీతమ్మలు వారి కుమార్తె మూలా రోహితాకు చెందిన ఇంట్లో నివాసం ఉంటున్నారు. మూలా నాగిరెడ్డికి, ఏలూరు సత్రంపాడుకు చెందిన మూలా పెద్దతిరుపతిరెడ్డి, అతని అల్లుడు వింత రమణారెడ్డి ఏలూరు అశోక్ నగర్‌కు చెందిన అతని తమ్ముడు మూల చిన్నతిరుపతిరెడ్డిలతో కోర్టులో సివిల్ తగాదాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురు కలిసి కొంత మందిని ఏర్పాటు చేసి 27న సుమారు 50 మంది ఆటోలు, కార్లు, మోటారు సైకిళ్లపై వచ్చి మూలా నాగిరెడ్డి ఇంట్లోకి వెళ్లి బయటికి పోవాలంటూ సామగ్రి బయటపడేశారు. ఇంటికి ఉన్న సీసీ కెమరాలు ధ్వంసం చేశారు. ఈ ఘటనపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మూలా పెద్ద తిరుపతిరెడ్డి, అతని అల్లుడు వింత రమణారెడ్డి, సోదరుడు మూలా చిన్నతిరుపతిరెడ్డిలపై కేసు నమోదు చేశారు.

పారామెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో 2025 - 26 సంవత్సరానికి గాను మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్లు, ఆప్తామాల్మిక్ అసిస్టెంట్, అనెస్తీషియా టెక్నీషియన్, మెడికల్ స్టెరిలైజేషన్ అండ్ ఓటీ టెక్నీషియన్, రేడియోగ్రాఫిక్ టెక్నిషియన్ డిప్లొమో కోర్సులలో ప్రవేశానికి రెండవ ఫేజ్ కౌన్సెలింగ్‌కు ఉమ్మడిపశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రభుత్వ మెడికల కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి తెలిపారు.అభ్యర్థులు తమ దరఖాస్తులను నవంబరు 7వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆఫీసు పని దినాల్లో ఏలూరు వైద్య కళాశాలలో రూ.100 రుసుం చెల్లించి వారి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.దరఖాస్తులు www.apseh-pc.com వెబ్‌సైట్‌లో ఉంటాయని డాక్టర్ సావిత్రి తెలిపారు. సక్రమంగా పూరించని దరఖాస్తులు తిరస్కరిస్తామని,తమ దరఖాస్తులను స్వయంగా ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో సమర్పించాలని, పోస్ట్ ద్వారా పంపితే తిరస్కరిస్తామన్నారు. పారామెడికల్ కోర్సులకు ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీ చదివిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని, తదుపరి ప్రాధాన్యత మిగిలిన గ్రూపుల ఉంటుందని డాక్టర్ సావిత్రి తెలిపారు.

తుఫాన్‌లో చిక్కుకున్న మహిళ క్షేమంగా ఇంటికి



మహిళను సోదరికి అప్పగిస్తున్న కానిస్టేబుల్

ఏలూరు క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా చిక్కుకున్న ఒంటరి మహిళకు ఉమెన్ ట్రాపెట్ హోమ్ ద్వారా సురక్షిత రక్షణను కల్పించి ఆమె ఇంటికి మహిళా కానిస్టేబుల్ చేర్చారు. పెదవేగి మండలం కొప్పాక గ్రామానికి చెందిన నల్లమిల్లి రంగమ్మ(26) రాజమహేంద్రవరంలోని బంధువుల ఇంటికి ఈ నెల 28వ తేదీ రాత్రి వెళ్లి తిరిగి వస్తుండగా తీవ్ర తుపాను ప్రభావంతో రవాణా సౌకర్యం నిలిచిపోవడం వల్ల ఆమె ఏలూరు పాతబస్టాండ్ వద్దకు రాత్రి 11 సమయంలో చేరుకుని దిక్కుతోచని స్థితిలో అయోమయంగా ఉంది. తమ గ్రామానికి వెళ్లడానికి ఎలాంటి అవకాశం లేకపోవడంతో ఒంటరిగా ఉన్న ఆమె పోలీస్ సహాయాన్ని పొందే నిమిత్తం డయల్ 112కు కాల్ చేసింది. ఈసమాచారం అందుకున్న పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది వెంటనే ఉమెన్ ట్రాపెట్ హోం టీమ్‌కు తెలియజేశారు. దీంతో మహిళా కానిస్టేబుల్ శిరీష, హోంగార్డులు కలిసి తక్షణం పాత బస్టాండ్‌కు చేరుకున్నారు. ఒంటరిగా ఉన్న రంగమ్మను పోలీస్ జీపులో ఎక్కించుకుని ఆమె స్వగ్రామమైన కొప్పాక గ్రామానికి తీసుకువెళ్లి సోదరికి అప్పగించారు.

దారికాచి సొమ్ము కాజేసిన దొంగలు

కేసు నమోదు చేసిన పోలీసులు

ఏలూరు క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణంలో పనిచేసే గుమస్తా రాత్రివేళ షాపు ముగిసిన తరువాత నగదును తీసుకుని వస్తుండగా మార్గమధ్యలో ఐదుగురు యువకులు దారికాసి దోపిడీ చేశారు. ఏలూరు రూరల్ మండలం పోణంగికి చెందిన గుడివాక ఆంజనేయప్రసాద్(52) కామవరపుకోట మండలం కళ్ల చెరువు గ్రామంలో మనీషా వైన్ షాపులో గుమస్తాగా పని చేస్తున్నాడు. ఈనెల 28వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో షాపుకట్టి 90 వేల రూపాయల నగదును పట్టుకుని మోటారు సైకిల్‌పై బయలుదేరి ఏలూరు తూర్పులాకుల వద్ద ఉన్న ఆ షాపునకు సంబంధించిన పుచ్చకాయల నాగేంద్ర ప్రసాద్‌కు ఇవ్వడానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఏలూరు - జంగారెడ్డిగూడెం రోడ్డులోని దెందులూరు మండలం గంగన్నగూడెం సమీపంలో ఐదుగురు యువకులు రెండు మోటారు సైకిళ్లపై అకస్మాత్తుగా వచ్చి వారిని అడ్డగించి చేతులతో కొట్టి, తలపై మోదారు. అతని వద్ద ఉన్న నగదును బెదిరించి లాక్కుని ఉడాయించారు. ఐదుగురి యువకుల వయస్సు సుమారు 22నుంచి 25 సంవత్సరాల వయస్సు ఉంటుందని బాధితుడు చెబుతున్నాడు. ఈ సమాచారం షాపు నిర్వాహకులు చెప్పడంతో వారికి సంబంధించిన వారు వచ్చి అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి అర్ధరాత్రి తీసుకువచ్చారు. ఈ సంఘటనపై దెందులూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పెదవేగి సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు దోపిడీ దొంగల కోసం గాలింపు చేపట్టారు.

ముందస్తుగా మలేరియా పరీక్షలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాల వల్ల అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఏలూరులోని లంబాడీపేట పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ట్వింకిల్ సూచించారు. బుధవారం యూహెచ్‌సీ పరిధిలోని ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వర్షాలవల్ల తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ గోవిందరావు మాట్లాడుతూ ఏదైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే వైద్యులను సంప్రదించాలని, ప్రాథమిక ఆరోగ్య పరీక్షలను ఉచితంగా చేస్తారని వివరించారు. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా 94మందికి మలేరియా పరీక్షలు చేశారు. వైద్య సిబ్బంది నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, గోపాలకృష్ణ, చిటిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి బ్యాగ్‌లో గొలుసు చోరీ

ఏలూరు క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఒక వృద్ధురాలు బంగారు గొలుసు బ్యాగ్‌లో పెట్టుకుని ఆటో ఎక్కింది. గుర్తు తెలియని ఇద్దరు మహిళలు ఆ గొలుసు అపహరించారు. ఏలూరు సమీపంలోని వట్లూరుకు చెందిన కారుమంచి రాజేశ్వరి(62) ఈ నెల 27వ తేదీ సాయంత్రం సత్రంపాడులో ఆటో ఎక్కి పాతబస్టాండ్‌లో దిగింది.అదే సమయంలో ఆమెతో పాటు మరో ఇద్దరు మహిళలు ఆటో ఎక్కారు. పాతబస్టాండ్ వద్ద ఆటోదిగి చూడగా రాజేశ్వరి హ్యాండ్ బ్యాగ్‌లో బంగారు గొలుసు కనిపించలేదు.దీంతో వెంటనే ఏలూరు టూటౌన్ పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ సంఘటనపై మంగళవారం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అపహరణకు గురైన గొలుసు సుమారు 5కాసులు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ ఇద్దరు మహిళల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

పెదపాడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పెదపాడు మండలం అప్పనవీడు పంచాయతీ తాళ్లమూడి గ్రామంలో పేకాడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసినట్టు పెదపాడు ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ తెలిపారు. వారి నుంచి రూ. 7,400 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూలిన చెట్టు - విరిగిన విద్యుత్ స్తంభాలు

• గంటల వ్యవధిలో పునరుద్ధరణ

ఏలూరు క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : చెట్టు కూలి విద్యుత్ వైర్లపై పడడంతో రెండు స్తంభాలు విరిగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది హుటాహుటిన చేరుకుని యుద్ధ ప్రాతిపదికన కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఎదురుగా ఒక చెట్టు బుధవారం ఉదయం విరిగి విద్యుత్ వైర్లపై పడటంతో రెండు స్తంభాలు విరిగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు అక్కడకు చేరుకుని వెంటనే రెండు కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి వైర్లను బిగించి విద్యుత్ పునరుద్ధరించారు.



విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కార్మిక సంఘ మహాసభలను జయప్రదం చేయండి

టి.నర్సాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): టి.నర్సాపురంలో నవంబరు 4,5,6 తేదీల్లో నిర్వహించే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు బుధవారం పిలుపునిచ్చారు. రాష్ట్ర జిల్లా స్థాయి నాయకులంతా పాల్గొంటారని మండలంలోని ప్రధాన సమస్యలైన భూసమస్యలు, ఉపాధి కార్మికుల సమస్యల కోసం చర్చిస్తామన్నారు. ఈ సభలకు జిల్లాలోని వ్యవసాయ కార్మికులు, నాయకులు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి: శ్రీనివాస్

ద్వారకాతిరుమల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):మొంథా తుపాన్‌వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని పంగిడిగూడెం, ఎం. నాగులపల్లి గ్రామాల్లో ఉద్యాన పంటలకు జరిగిన నష్టాన్ని సంఘ నాయకులు బుధవారం పరిశీలించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు ఈ తుపాన్ తీవ్రనష్టాన్ని మిగిల్చిందన్నారు. పంగిడిగూడెంలో రూ.50వేల పెట్టుబడితో బంతిపూల సాగు చేపట్టిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు.

ఏలూరులో 5న మెగా జాబ్‌మేళా



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నవంబరు 5న ఏలూరులోని కేపీడీటీ హైస్కూల్లో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాబ్ మేళ బ్రోచర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు యువతకు ఉద్యోగాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ జాబ్ మేళాలో రాష్ట్ర వ్యాప్తంగా 17 కంపెనీలు పాల్గొం టాయన్నారు. 1200 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తా మన్నారు. 5న ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు జాబ్‌మేళ నిర్వ హిస్తామన్నారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.ప్రవీన్, ఇడా ఛైర్మన్ శివప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షుడు చోడే వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి రెడ్డి నాగరాజు పాల్గొన్నారు.

ఏఎంసీ కార్యవర్గం ఖరారు

చింతలపూడి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఎప్పుడా అని ఎదురుచూస్తున్న చింతలపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీకి కార్యవర్గం ఖరారైంది. గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, అధ్యక్షుడిగా చీదరాల దుర్గా పార్వతి, ఉపాధ్యక్షుడిగా మారిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, సభ్యులుగా మాదాసు దినకర్ కిషోర్, దండి పద్మ, మండవ నాగేంద్ర ప్రసాద్, గెడ్డం శ్రీను, డోలా విజయ్‌బాబు, చెలికాని కిరణ్, మరిడి రాంబాబు, శీలవరపు ఇంద్రాణి, వల్లభనేని అనసూయ, పాకనాటి అంజిబాబు, సత్యవరపు వెంకటేశ్వరరావు, పోకల జయభాగ్యలక్ష్మి, సయ్యద్ మీర జఫ్రాలి, ఎస్.ఎస్.ఎన్.గాంధీ, వ్యవసాయ శాఖ ఏడీ, రావికంపాడు సర్పంచ్, జిల్లా అగ్రి ట్రేడ్, మార్కెటింగ్ ఆఫీసర్ సభ్యులుగా ఉన్నారు.

రేపు ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ 106వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్టు సీపీఐ నాయకులు బండి వెంకటేశ్వరరావు, మన్నవ కృష్ణచైతన్యలు తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం నాయకులు మాట్లాడుతూ భారతదేశ ఉద్యోగ కార్మిక వర్గానికి అనేక చట్టాలను, రాయితీలను సాధించిపెట్టిన ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉద్యోగ, కార్మిక, శ్రామిక వర్గం హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ వ్యవస్థాపక దినోత్సవంలో ఉద్యోగులు, కార్మికులు శ్రామికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనండి..

కామవరపుకోట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల కోసం పోరాటాలు చేసే ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 31న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు సీపీఐ మండల కార్యదర్శి తాడిగడప వెంకట సత్తిరాజు పిలుపునిచ్చారు. సీపీఐ కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన కార్మికులతో మాట్లాడుతూ వ్యవస్థాపక దినోత్సవం ఆవశ్యకతను వివరించారు. 44 కార్మిక చట్టాలను సాధించిన ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. పలువురు సీపీఐ కార్యకర్తలు, అనుబంధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం పనులు వేగవంతం చేయాలి

బుట్టాయగూడెం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం పనులు వేగవంతం చేయాలని అలివేరు సర్పంచ్ కారం లక్ష్మీ పంచాయతీ, సచివాలయం సిబ్బందికి సూచించారు. బుధవారం సచివాలయంలో ఆమె తుఫాన్ అనంతరం గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పర్యటించి నష్ట నివారణ పనులను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. తుఫాను కారణంగా ఎక్కడైన మంచినీటి పైపులు దెబ్బతినా, విద్యుత్‌కు అంతరాయం కలిగినా, వర్షాలు తగ్గుముఖం పట్టాక సీజనల్ జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. కార్యదర్శి రామకృష్ణ, కారం రాఘవ, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ పీడీ పరామర్శ

భీమడోలు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పునరావాస కేంద్రాల్లో ఉన్న గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ పీడీ శారద పరామర్శించి సౌకర్యాలపై ఆరా తీశారు. పూళ్లలోని ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రంలో ఉన్న గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీవో రాజశేఖర్, సూపర్‌వైజర్ నూర్జహాన్, వైద్యురాలు అరుణజ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముంచిన మొంథా

(5వ పేజీ తరువాయి)

సమర్పించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం రాత్రి తుఫాన్ నష్టం అంచనా లపై అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ ఆరా తీశారు. జిల్లాలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని, ఎవ్వరూ గాయ పడలేదన్నారు. నాలుగు పశువులు చనిపోయాయని, 18 ఇళ్లు దెబ్బ తిన్నాయని, 9298.64 హెక్టార్లల్లో పంట నష్టం జరిగిందని ప్రాథమికంగా గుర్తించామన్నారు. పునరావాస కేంద్రాలలో తుఫాన్ బాధితులకు ఇంతవరకు 30 టన్నుల బియ్యం, మూడు టన్నుల కాయగూరలతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారన్నారు. 148 వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్డీవోలు అచ్యుత్ అంబరీష్, రమణ పాల్గొన్నారు. కాగా రానున్న రెండు రోజుల్లో జిల్లా అంతటా పెద్దఎత్తున పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం తుఫాన్ అనంతరం పారిశుధ్య, సహాయక కార్యక్రమాలు, నష్ట నివారణ అంచనాలపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

జిల్లాలో వర్షపాతం వివరాలు : గత 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా ద్వారకాతిరుమల మండలంలో 70.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 31.3 మి.మీగా నమో దైంది. పెదవేగి 59.6, ముసునూరు 59.4, కామవరపుకోట 57, నూజివీడు 40.8, టి.నరసాపురం, పెదపాడు 37.6, పోలవరం 37.2, ఆగిరిపల్లి 36.4, కైకలూరు 35, లింగ పాలెం 34.2, జంగారెడ్డిగూడెం 33, చాట్రాయి 30.8, మండ వల్లి 29.8, చింతలపూడి 27.6, ఏలూరు అర్బన్, దెందు లూరులో 25.8, కలిదిండి 25.4, భీమడోలు 25, నిడమర్రు 23.6, ముదినేపల్లి 22.4, ఉంగుటూరు 21.2, ఏలూరు రూర ల్ 19.6, బుట్టాయిగూడెం 17.8, కొయ్యలగూడెం 17.4, జీలుగుమిల్లి 14, వేలేరుపాడు 6.8, కుక్కునూరు 6.2 మి.మీ వర్షపాతం నమోదైంది. కాగా బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు 11 మండ లాల్లో మొత్తం 46.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా ఇందులో అత్యధికంగా జీలుగుమిల్లి మండలంలో 17.8 మి.మీ, చింతలపూడి 10.4 మి.మీ, టి.నరసాపురం 5 మి.మీ, మిగిలిన 8 మండలాల్లో 5 మి.మీ కన్నా తక్కువగానే వర్షపాతం నమోదైంది.

పెరుగుతున్న కొల్లేరు

కైకలూరు/మండవల్లి : తుపాను ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు కొల్లేరు నీటి ప్రవాహ ఉధృతి పెరిగింది. ఇప్పటికే పెద్దఎడ్లగాడి - పెనుమాకలంక ఆర్‌అండ్‌బీ రోడ్డుపై మూడు అడుగులు నీరు ప్రవహిస్తుండగా లంక గ్రామాలకు రాక పోకలు స్తంభించాయి. పెద్దఎడ్లగాడి నుంచి పెనుమాకలంక, నందిగామలంక తదితర లంక గ్రామాలకు పడవల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. కైకలూరు మండలంలో కొల్లేరు ఉధృతి క్రమేణ పెరుగుతోంది. ఎగువ నుంచి వర్షపునీరు 64 మేజర్, మైనర్ డ్రెయిన్ల ద్వారా చేరుతోంది. గోకర్ణపురం-పైడిచింతపాడు రహదారి రెండుచోట్ల ముంపుబారిన పడింది.

ఎల్‌ఆర్‌ఎస్‌కు పచ్చజెండా

(5వ పేజీ తరువాయి)

దాని అసలు విలువపై ఓపెన్ స్పేస్ ఛార్జీల కింద 10 శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఎల్‌ఆర్‌ఎస్ వల్ల చట్టబద్ధ భవన అనుమతులు, ఆధునిక వసతులు (నీరు, విద్యుత్, డ్రెయినేజీ) సౌకర్యాలు పొందవచ్చు. భవిష్యత్‌లో న్యాయబద్ధమైన లావాదేవీలతో పాటు చట్టపరమైన భద్రత కలిగి ఉండవచ్చు. ఇడా పరిధిలో అయితే హెల్ప్‌డెస్ ఫోన్ నంబర్ 99668 48055లో సంప్రదించవచ్చు.

అర్హతా ప్రమాణాలు : క్రమబద్ధీకరణకు జూన్ 30,2025లోగా రిజస్టర్ కాబడిన అనధికార ప్లాట్లు/ లే-అవుట్లకు వర్తిస్తాయి. కనీసం ఒక ప్లాట్ అమ్మకం ఈ తేదీకి ముందుగా జరిగి ఉండాలి. ప్లాట్ అనధికారిక లే-అవుట్‌ల్లో భాగంగా ఉండాలి.



తిమ్మాపురం రోడ్డు క్లియర్ చేయిస్తున్న ఎస్.ఐ. సుధీర్..



పొలాలు పరిశీలిస్తున్న పద్మశ్రీ



కొయ్యలగూడెంలో పొలాలు పరిశీలిస్తున్న అధికారులు



జీలుగుమిల్లిలో చెట్ల తొలగింపును పరిశీలిస్తున్న ఎస్.ఐ. విక్రాంత్ కుమార్

కష్టం.. నష్టం..

- ముంపు బారిన పడిన పంట పొలాల పరిశీలన
- రైతులకు నష్ట నివారణపై సూచనలు
- ప్రభుత్వానికి నివేదిక పంపుతామంటున్న అధికారులు

పెదపాడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని జడ్పీ ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని నాయుడుగూడెం, రాజుపేట, వట్లూరు, పెదపాడు గ్రామాల్లో పంట నష్టాన్ని బుధవారం ఆమె పరిశీలించి రైతులతో మాట్లాడారు. నష్టపో యిన రైతులను గుర్తించి నష్టాన్ని అంచనా వేసి త్వరితగతిన నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

● చింతలపూడి: తుఫాన్ ప్రభావంతో మండలంలో 200 ఎకరాల్లో వరి పంట నేలవాలింది. మండల వ్యవసాయాధికారులు, కూటమి నాయకులు గ్రామాల్లో పర్యటించి పరిశీలించారు. నగర పంచాయతీలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 122 మందికి ఆశ్రయం కల్పించనట్టు మండల తహసీల్దార్ ప్రమద్వర తెలిపారు. బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో మండల జనసేన అధ్యక్షుడు చీదరాల మధుబాబు పర్యవేక్షించారు.

● భీమడోలు: తుఫాను ప్రభావంతో ముందస్తు చర్యలు చేపట్టినట్టు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. భీమడోలు, ఆగడాలలంక గ్రామాల్లో 11 విద్యుత్ స్తంభాలకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టినట్టు తెలిపారు. ఏర్పాటు చేసిన నాలుగు పునరావాస కేంద్రాల్లో 195 మందిని తరలించామన్నారు.

● కుక్కునూరు: మండలంలో పత్తిపంట పరిస్థితిని మండల వ్యవసాయాధికారి ఆర్.బాలాజీ పరిశీలించారు. పత్తికాయల్లో తేమ పెరిగి కుళ్లు ఏర్పడుతోందని ఏవో తెలిపారు. జంగారెడ్డిగూడెంలో పత్తికొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని కనీస మద్దతు ధరగా ప్రభుత్వం క్వింటాలుకు రూ.8110 నిర్ణయించిందన్నారు. మిర్చి పంటలో మొగ్గలు కుళ్లిపోతున్నట్టు రైతులు వాపోతున్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారు కిసాన్ కపాస్ అనే యాప్ ద్వారా రైతులు రిజిస్ట్రేషన్ చేసుకుని స్లాట్ బుకింగ్ ద్వారా పత్తిని విక్రయించుకోవాలన్నారు. వ్యవసాయ సహాయ కులు సుధారాణి, భాగ్యలక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

● కామవరపుకోట: నష్టాలపై వ్యవసాయ శాఖాధికారులు బుధవారం సర్వే ప్రారంభించారు. మండల వ్యవసాయ శాఖాధికారి ముత్యాలరావు మాట్లాడుతూ రావికంపాడు, గుంటుపల్లి, ఉప్పలపాడు, కె.ఎస్.రామవరం, అంకాలంపాడు, కామవరపుకోట తదితర గ్రామాల్లో తమ బృందం క్షేత్ర స్థాయిలో పరిశీలించిందన్నారు. మండలంలో 113 ఎకరాల్లో వరి పంట నేలకొరిగిందన్నారు. నష్టనివారణపై రైతులకు ఆయన సూచనలు చేశారు.

● ద్వారకాతిరుమల: మండలంలోని తిమ్మాపురంలో ద్వారకాతిరుమల క్షేత్రానికి చేరే ప్రధాన రహదారిపై ఓ వృక్షం కుప్పకూలింది. దీంతో స్థానికులతో పాటు ఎస్.ఐ. సుధీర్ దగ్గరుండి తొలగించారు. నారాయణపురం, ఎం.నాగులపల్లి, పంగిడిగూడెం, కృష్ణాపురం గ్రామాల్లో ఉద్యావన పంటలు 17.50 ఎకరాల్లో నష్టం జరిగింది. నారాయణపురం, ఎం.నాగులపల్లి, పంగిడిగూడెం, కృష్ణాపురం గ్రామాల్లో రూ.46.50 లక్షలు, ఎం.నాగులపల్లి, గుణ్ణంపల్లి, పి.కన్నాపురం, నారాయణపురం గ్రామాల్లో 563 ఎకరాల్లో వరి పంట ఒరిగిపోయింది.

● జీలుగుమిల్లి: లక్ష్మీపురంలో జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి అడ్డంగా భారీ వృక్షం పడింది. గ్రామంలో ఇళ్ల మధ్య వృక్షం పడటంతో సమీపంలో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఎస్సై విక్రాంతి కుమార్, మండల జనసేన నాయకులు, అధికారుల ఆధ్వర్యంలో భారీ వృక్షాన్ని తొలగించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

● బుట్టాయగూడెం: చెదురు మదురు ఘటనలు మినహా ఏజెన్సీపై మొంథా తుఫాన్ ప్రభావం లేదనే చెప్పవచ్చు. నష్టం కూడా స్వల్పంగానే ఉన్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు. కెఆర్ పురం, అచ్చియ్యపాలెం ప్రాంతాల్లో 8 కరెంటు స్థంభాలు పడిపోగా అధికారులు పునరుద్ధరించారు. దొరమామిడిలో గోరంట్ల శర్మ ఇంటిపై కొబ్బరి చెట్టు విరిగిపడటంతో ఉప సర్పంచ్ మద్దిపాటి శ్రీను వెంటనే స్పందించి తొలగించారు. అలివేరులో ఎకరం వరిపంట నీట మునిగిందని ఏడీఏ తెలిపారు.

● పోలవరం: మండలంలోని గుంజవరంలో తహసీల్దారు సాయిరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి 7 కుటుంబాలకు ఆశ్రయం కల్పించారు. వర్షపాతం 17.5 మిల్లీమీటర్లు నమోదైందని తహసీల్దారు తెలిపారు. గుంజవరంలో గాలులకు విద్యుత్ తీగలు తెగిపడటంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఎల్.ఎన్.డి.పేట రిజర్వాయర్ నీటిమట్టం పెరిగి నిండుకుండలా మారడంతో అధికారులు నీటిని దిగువకు విడుదల చేశారు. తుఫాన్ ప్రభావంతో ప్రజలు ప్రయాణాలు మానుకోవడంతో ఆర్టీసీ బస్సులు ప్రయాణికులు లేక వెలవెలబోయాయి.

● ఏలూరు రూరల్: తుఫాన్ ప్రభావంతో కొల్లేరులో భారీగా నీరు చేరుతోంది. దీంతో కోమటిలంక వాగు ఉధృతి పెరిగి రాకపోకలు నిలిచిపోయాయి. తుఫాన్ ప్రభావాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించినట్టు తహసీల్దార్ విజయ కుమార్‌రాజు, ఎంపీడీవో గారపాటి నాగరాజు కుమారి తెలిపారు. రూరల్ మండలంలోని మల్కాపురం, జాలిపూడి, చాటపర్రు ప్రాంతాల్లో సుమారు 500 ఎకరాల్లో పొట్టు, వెన్ను వేసే దశలో ఉన్న వరి నేల వాలింది. స్వర్ణ రకం 90 శాతం, 1318 రకం 10 శాతం నీట మునిగింది.

● కొయ్యలగూడెం: భారీ వర్షాలకు రామానుజపురంలోని కాట్రు శ్రీను తాటాకిల్లు పడిపోగా తారకరామ్ నగర్‌లో ఇంటిపై వేపచెట్టు పడి స్వల్ప నష్టం వాటిల్లింది. అనేక చోట్ల వైర్లు, స్తంభాలు ఒరిగిపోవడంతో ట్రాన్స్‌కో అధికారులు మరమ్మతులు చేపట్టారు.

● పెదవేగి: రామచంద్రాపురం, విజయరాయి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో యూటీఎఫ్ మండల నాయకులు బుధవారం సందర్శించి అల్పాహారం అందించారు. యూటీఎఫ్ మండల శాఖ నాయకులు తేరా ప్రభాకర్, పోలిరెడ్డి వెంకటరమణ, మేకా లక్ష్మీనారాయణ, మరీదు లక్ష్మణరావు పాల్గొన్నారు.

● కామవరపుకోట: జీలకర్రగూడెం ఉన్నత పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాసకేంద్రాన్ని తహసీల్దార్ గెడ్డం ఎలీషా పరిశీలించి బాధితుల క్షేమాన్ని అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ వెంట పంచాయతీ కార్యదర్శి రత్నకుమారి, వీఆర్వో కె.ప్రభాకరరావు, నాయకులు బేతిన వెంకట్రావు, కంఠమనేని అంజిమూర్తి, బాహుబలేంద్రుని బాలవర్ధిరాజు, గోరింక దాసు ఉన్నారు.

● లింగపాలెం: తుఫాన్ ధాటికి నేలవాలిన వరిపంటను మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్‌కుమార్ బుధవారం పరిశీలించారు. మండలంలో 200 ఎకరాల్లో వరి నేల వాలిందన్నారు.

● ఏలూరు రూరల్: మల్కాపురం, జాలిపూడి తదితర ప్రాంతాల్లో నేలకొరిగిన వరి చేలను మండల వ్యవసాయ శాఖ అధికారిణి ఎ.జీవన సంధ్య పరిశీలించారు. రైతులకు నష్ట నివారణ చర్యల గురించి వివరించారు. మండలంలో 496 ఎకరాల్లో వరి నేలవాలిందన్నారు.

● కొయ్యలగూడెం: దిప్పకాయలపాడులో రైతు యనమదల ప్రసాద్ వరి చేను, పొంగుటూరు, రాజవరం, వేదాంపురం తదితర గ్రామాల్లో పంటలు నేలకొరిగాయి. బయ్యన్నగూడెంలో స్తంభాలు ఇళ్లపై ఒరిగిపడిపోవడంతో టీడీపీ మండలాధ్యక్షుడు సమస్యను ఎంపీ, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.దీంతో ఆ ఇద్దరు అధికారులను అప్రమత్తం చేయడంతో త్వరితగతిన సమస్యను పరిష్కరించామని ఆయన తెలిపారు. కొయ్యలగూడెం పట్టణంలోని తారకరామ్ నగర్‌లోకి వరద చేరడంతో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి వెళ్లి ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆమె కోరారు.

● పెదపాడు: మండలం కొణికి పంచాయతీ కార్యాలయం పక్కనే తుపాను ప్రభావంతో వీచిన ఈదురుగాలులతో భారీ వృక్షం నేలకూలింది. వెంటనే స్పందించిన సర్పంచ్ పొట్లూరి యుగంధర్ సిబ్బంది సహకారంతో చెట్టు తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

● దెందులూరు: మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలో 1425 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. ఎక్కువగా స్వర్ణ రకం వరి రైతులు దెబ్బతిన్నారు. దోసపాడు గ్రామంలో రైతులు వరి పనులు కట్టారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఎల్.శ్రీనివాసరాజు, సర్పంచ్ గోరింక ఏసోబు, గోదారి కాల్వ డీసీ వైస్ ఛైర్మన్ అత్తూలూరి చంద్రశేఖర్, టీడీపీ నాయకులు మోదూరి వెంకటేశ్వరరావు, అత్తులూరి శ్రీనివాస్, నెరుసు గంగరాజు, బొల్లే రాము వరి చేలను పరిశీలించారు. పోతునూరు, కొవ్వలి, దోసపాడు, దెందులూరు, ఉండ్రాజవరం, కేధవరం సత్యనారాయణపురం గ్రామాల్లో దెబ్బతిన్న వరి పొలాలను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. కొవ్వలి రోడ్డులో చెట్లు పడి పోవడంతో మండల ప్రత్యేకాధికారి వివేకా నంద, తహసీల్దార్ సుమతి, ఎంపీడీవో భీమరాజు, దెందులూరు పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ అనూషలు దగ్గరుండి తొలగింపు పనులు చేపట్టారు. సింగవరం హైస్కూల్లోని పునరావాస కేంద్రంలో 68 మందికి అల్పాహారం, భోజనం అందించారు. గుండేరు వాగు ఉధృతి నేపథ్యంలో అధికారులు పర్యవేక్షణా చర్యలు చేపట్టారు.

● పెదవేగి: మొంథా ధాటికి చాలాచోట్ల వరిపంట నేలవాలిందని సంరక్షణ చర్యలు చేపట్టాలని ఏలూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కె.ఫణికుమార్ చెప్పారు.వరి పొలాలను ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పెదవేగి మండలం బి.సింగవరం, కొప్పాక, ముండూరు, చక్రాయగూడెం గ్రామాల్లో పర్యటించి పరిశీలించారు. డాక్టర్ ఫణికుమార్ మాట్లాడుతూ సూర్య సూపర్ 5517, కావేరి స్వర్ణ వరిరకాలు నేలకొరిగాయని, కొన్నిచోట్ల మొలకలు కూడా వచ్చాయన్నారు.

● పెదవేగి: మొంథా తుఫాన్ తీవ్రతపై ఎప్పటికప్పుడు సమీక్షలు చేసి చర్యలు చేపట్టినట్టు పెదవేగి తహసీల్దారు ఎస్.డి.భ్రమరాంబ తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను తుఫాన్ సహాయక శిబిరాలకు తరలించి, భోజన, వసతి సౌకర్యాలు కల్పించామన్నారు. పెదవేగి మండలంలో రామచంద్రాపురం, విజయరాయి గ్రామాల్లో రెండు సహాయక శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. పెదవేగి తహసీల్దారు కార్యాలయంలో ఎంపీడీవో కె.రవికుమార్, టీడీపీ పెదవేగి మండలాధ్యక్షుడు ఈడ్పుగంటి అనిల్ కుమార్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో తహసీల్దారు మాట్లాడుతూ మొంథా తుఫాన్ ముప్పు తప్పిందన్నారు.

● జంగారెడ్డిగూడెం: మొంథా తుఫాన్ కారణంగా పట్టణంలోని జడ్పీ బాలికల హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ ఆధ్వర్యంలో బుధవారం పరిశీలించారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆదేశాలతో పునరావాస కేంద్రాన్ని పరిశీలించినట్లు కిషోర్ తెలిపారు. తహసీల్దార్ కె.స్లీవజోజీ, రాష్ట్ర క్షత్రియ, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్లు నంబూరి రామచంద్రరాజు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ పాతూరి అంబేడ్కర్, గుమ్మడి ప్రసాద్, గెడా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



ఉంగుటూరులో పొలాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు



బోయగూడెం వాసులను పరామర్శిస్తున్న రోషన్



పి.కన్నాపురంలో పొలాలు పరిశీలిస్తున్న మద్దిపాటి

రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యేల పర్యటన

ఆదుకుంటామంటూ రైతులకు భరోసా

ఏలూరుటూటౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మూడ్రోజులుగా నియోజకవర్గంలోనే ఉంటూ తుఫాన్ సహాయక చర్యల్లో ఎంపీ పుట్టా మహేశ్ పాల్గొన్నారు. పార్టీ నాయకులు, అధికారులతో నిరంతరం సంప్రదిస్తూ సహాయక చర్యలు చేపట్టారు. టి.నర్సాపురం, పోలవరం, ముదినేపల్లి, మండలాల నుంచి మంగళవారం రాత్రి తుఫాన్ బాధితులు ఆపదలో ఉన్నామని ఫోన్లు చేయగా వెంటనే స్థానిక పార్టీ నాయకులు, అధికారులను ఆ ప్రదేశానికి పంపి సమస్యలను పరిష్కరింపజేశారు. పోలవరం మండలంలో కొవ్వాడ కాల్వ ఉధృతి పెరగడంతో అధికారులను పంపి సహాయక చర్యలు చేపట్టారు.

విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్నాం : చంటి

ఏలూరుటూటౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ వలన ఏర్పడిన విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్నట్టు ఎమ్మెల్యే చంటి తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సహాయక చర్యల్లో పాల్గొని బాధితులకు పూర్తి భరోసా నింపారు. శనివారపుపేటలో, కోటదిబ్బలోని కస్తూరిబా బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. చోడే వెంకటరత్నం, అమరావతి అశోక్, రెడ్డి నాగరాజు, కడియాల విజయలక్ష్మి, లంకపల్లి మాణిక్యాలరావు పాల్గొన్నారు.

● అమరావతి సచివాలయంలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్‌ను ఎమ్మెల్యే బడేటి చంటి బుధవారం కలిశారు. నియోజకవర్గ సమస్యలపై వారితో చర్చించారు.

పునరావాస కేంద్రాలు పరిశీలించిన రోషన్..

చింతలపూడి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలకు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ బుధవారం సాయంత్రం పర్యవేక్షించారు. బోయగూడెం చెరువుగట్టు సమీపంలో నివసిస్తున్న వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పునరావాస కేంద్రాన్ని సందర్శించారు.

వరి చేలు పరిశీలించిన ధర్మరాజు

నిడమర్రు అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతును ఆదుకుంటామని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు హామీ ఇచ్చారు. బుధవారం ఉంగుటూరు మండలంలో కాగుపాడు, నాచుగుంట గ్రామాల్లో దెబ్బతిన్న వరిపొలాలను ఎమ్మెల్యే ధర్మరాజు పరిశీలించారు. పరిశీలించిన అధికారులు ప్రాథమికంగా 1914 ఎకరాల్లో వరి నేలకొరిగిందని తెలిపారు. ఉంగుటూరు మండలంలో 687 ఎకరాలు వరి నీట మునిగిందని, రైతులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అగ్రికల్చర్ ఏడీ ఉషారాణి, ఏఎంసీ చైర్మన్ , రైతులు, టిడీపి , జనసేన నాయకులు పాల్గొన్నారు.

పి.కన్నారపురంలో మద్దిపాటి పర్యటన..

ద్వారకాతిరుమల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటామని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని పి.కన్నాపురంలో వరి పొలాలను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో పంట పొలాలు పరిశీలించి ఎవ్వరూ ఆందోళన చెందవద్దన్నారు.

పెదవేగి ఎంఈవోగా ప్రభాకరరావు

ఏలూరు అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పెదవేగి మండల విద్యాధికారి(ఎంఈవో-1)గా ఐ.వి.వి.ప్రభాకరరావును నియమించారు. ఇప్పటివరకు ఎంఈవో-1గా పనిచేస్తున్న బి.త్రిపుర సుందరీదేవి స్థానంలో ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ప్రభాకరరావు పెదవేగి మండలం గార్లమడుగు ప్రభుత్వ ఓరియంటల్ హైస్కూల్లో గణితం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. పాఠశాల విద్య కాకినాడ ఆర్జేడీ నాగమణి నుంచి డీఈవోకు ఆదేశాలందాయి.

అయ్యప్ప భక్తులకు భిక్ష

దెందులూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అయ్యప్పమాల దీక్షధారులకు దాత, పారిశ్రామికవేత్త డీవీఆర్‌కే చౌదరి దంపతులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాలధారులు భిక్ష స్వీకరించారు.



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

ఏలూరులో జాతర్ల సందడే సందడి

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ ఏడాది జాతర్ల సందడి ప్రారంభమైంది. ఇప్పటికే ఈ నెల 23న పడమరవీధిలో జాతరకు అంకురార్పణ జరిగింది. 31న తూర్పు వీధి, దక్షిణపువీధిలలో ఒకే రోజున ముడుపు కట్టే కార్యక్రమానికి నిర్వాహకులు శ్రీకారం చుట్టారు. పవరుపేటలో నవంబరు 9వ తేదీన ముడుపులు కట్టి రాటా వేసేందుకు నిర్వాహకులు ఇప్పటికే ప్రకటించారు.బుధవారం స్థానిక దక్షిణపువీధి మార్కండేయస్వామి ఆలయం వద్ద ఏలూరు సర్వజన సమ్మేళన దక్షిణపువీధి జాతరను ప్రకటించి బ్రోచర్లను ఆవిష్కరించారు.ఈ మేరకు కమిటీ అధ్యక్షులు అద్దేపల్లి శ్రీనివాసరావు, నాయకులు కర్రి శ్రీనివా సరావులు జాతర వివరాలు తెలిపారు.

ఫాదర్ బాలకు అరుదైన గౌరవం



దెందులూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మహా జూబిలీ ఉత్సవాల్లో భాగంగా వాటికన్‌సిటీ వెళ్లిన ఏలూరు పీఠం వికార్ జనరల్ ఫాదర్ రెవ డాక్టర్ పి.బాలకు ఇటలీలో అరుదైన గౌరవం దక్కింది. ఇటలీలోని సిసిలీలో ఉన్న అంటోని చర్చిలో బుధవారం రెవ ఫాదర్ దేవసహాయం ఆధ్వర్యంలో ఫాదర్ పి.బాలకు 39వ గురు పట్టాభిషేకం అత్యంత వైభవంగా జరిగింది. ప్రపంచ ఆర్‌సీఎం సంస్థల విచారణ గురువు పోప్ లియో చేతుల మీదుగా జూబిలీ వేడుకల సమయంలో సన్మానం జరగడం ఆనందంగా ఉందని బాల పేర్కొన్నారు.

31, 1న క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం ఏజెన్సీ లయన్స్ క్లబ్, విద్యా వికాస్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 31న, నవంబరు 1న క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం విద్యా వికాస్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్టు లయన్స్ క్లబ్ పట్టణ అధ్యక్షుడు దాసరి శేషు కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శేషుకుమార్ మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు సేవలందరిస్తారన్నారు.

ఆంధ్రజ్యోతి నూజివీడు
కైకలూరు, నూజివీడు

నూజివీడు నియోజకవర్గంలో మోస్తరు వర్షం

నూజివీడు టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో నూజివీడు నియోజకవర్గంలో ఓ మోస్తరు వర్షపాతం నమోదు అయింది. మంగళవారం సాయంత్రం నుంచి వర్షం నమోదు కాగా అత్యధికంగా ముసునూరు మండలంలో 59.4 మిల్లీమీటర్లు, చింతలపూడిలో 27.6, నూజివీడులో 40.8, ఆగిరిపల్లి 36.4, లింగపాలెం 34.2, చాట్రాయిలో 30.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది.

హెలికాప్టర్ నుంచి సీఎం పంట నష్టం పరిశీలన

ముదినేపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో ముదినేపల్లి మండలంలో నెలకొన్న పరిస్థితులను సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం సాయంత్రం హెలికాప్టర్ ద్వారా పరిశీలించారు. పశ్చిమలో పంట నష్టం పరిశీలన అనంతరం సీఎం చిగురుకోట, పెద కామనపూడి, చినకామనపూడి, ముదినేపల్లి, చినపాలపర్రు, పెద పాలపర్రు గ్రామాల్లోని పొలాల్లో నేల కొరిగిన నీట మునిగిన సార్వా వరిపైరును చూశారు.

కొనసాగుతున్న ముందు జాగ్రత్త చర్యలు


ఉప్పువాగు వద్ద అధికారుల పహారా

చాట్రాయి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను తీరం దాటినా అధిక వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో మండలంలో అన్ని శాఖల అధికారులు ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు కొనసాగిస్తున్నారు. మండలం పక్క నుంచి వెళుతున్న తమ్మిలేరు ఏటి ఒడ్డు గ్రామాల వద్ద, ఉధృతంగా ప్రవహించే వాగుల వద్ద పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది పహరా కాస్తున్నారు. మండల స్పెషలాఫీసర్, డివిజనల్ అభివృద్ధి అధికారి వెంకటరత్నం, ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్సై డి. రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరరావు ముందు జాగ్రత్త చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

పునరావాస కేంద్రంలో భోజన ఏర్పాట్లు

మండలంలోని పోలవరం దళితవాడ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన తుఫాన్ పునరావాస కేంద్రంలోని వారికి భోజనం, అల్పాహారం ఇతర సదుపాయాలు అందిస్తున్నారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు బిలుగుది జయ రాజు, వీఆర్వో తేజాకుమారి భోజన ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. వైద్య, అంగన్వాడీ సిబ్బంది కూడా సేవలు అందిస్తున్నారు.

ముసునూరు: చెక్కపల్లి జడ్పీ పాఠశాలలోని పునరావాస కేంద్రంలోని సుమారు 50 కుటుంబాలకు బుధవారం స్థానిక టీడీపీ నాయకులు భోజన వసతి ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి మందులను అందజేశారు. ఎంపీడీవో పిల్లి ఏసుబాబు, ఎస్ఐ ఎం.చిరంజీవి బాధితులతో మాట్లాడి ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తేవాలన్నారు. అంబేద్కర్ కాలనీ పక్కన ఉన్న బసవరపుపాడు వాగులో ఇంకా వరద ఉధృతి కొనసాగుతోందని, రేపటి వరకు కాలనీవాసులు పునరావాస కేంద్రంలోనే ఉండాలని కోరారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఏవో

ముసునూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటామని మండల వ్యవసాయ అధికారి ఎ.చాముండేశ్వరి అన్నారు. బుధవారం చెక్కపల్లి, ముసునూరు, గుడిపాడు, వలసపల్లి గ్రామాల్లో ఒరిగిన వరి పంటలను టీడీపీ నాయకులతో కలిసి ఆమె పరిశీలించారు. మొలక వచ్చే అవకాశం ఉన్నందున ముందుగా ఐదు శాతం ఉప్పు ద్రావణం పిచికారి చేసుకోవాలన్నారు. పూర్తిస్థాయి నివేదికను త్వరలో ఉన్నతాధికారులకు అందజేస్తామని ఏవో చెప్పారు.

కూలిన పూరిల్లు.. మంత్రి ఆర్థిక సాయం

ముసునూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా అక్కిరెడ్డిగూడెంలో కొప్పుల నాగేశ్వరరావు పూరిల్లు మంగళవారం రాత్రి కూలింది. ముందస్తుగా కుటుంబీకులను పునరావాస కేంద్రంలోకి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. బుధవారం టీడీపీ మండల టీడీపీ అధ్యక్షుడు గద్దె రఘుబాబు కూలిన ఇంటిని పరిశీలించి మంత్రి పార్థసారథి అందజేసిన రూ. 5వేలు నగదును అందజేశారు.

బాధితులకు దుప్పట్ల వితరణ

కలిదిండి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెదలంక, పెదపుట్లపూడి గ్రామాల్లో పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు దాత టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ అక్కల వెంకటాచలం రూ.30 వేలు విలువ గల దుప్పట్లను బుధవారం పంపిణీ చేశారు. టీడీపీ యువ నాయకులు దున్న శ్రీనివాసరావు, పిళ్లారిశెట్టి భార్గవ్, ముద్దం పాండురంగారావులు పాల్గొన్నారు.

తూముల్లో పూడిక తొలగింపు

చాట్రాయి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని జనార్దనవరం నుంచి తుమ్మగూడెం వెళ్ళే రహదారిలో రామయ్యచెరువు వద్ద వరద నీరు ప్రవహించే తూములు పూడిపోయి రోడ్డు మునిగి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోగా మంత్రి పార్థసారథి ఆదేశాలతో జనార్దవరం గ్రామ టీడీపీ అధ్యక్షుడు మాదాసు చిన్న పుల్లయ్య, నీటి సంఘం అధ్యక్షుడు వంగల సుబ్బారావు ఎక్స్‌కవేర్‌తో తూములలో పేరుకుపోయిన పూడిక తొలగించారు. గ్రామాల మధ్య రాకపోకలకు అడ్డంకి తొలగటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముంచిన మొంథా

(5వ పేజీ తరువాయి)

సమర్పించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం రాత్రి తుఫాన్ నష్టం అంచనాలపై అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ ఆరా తీశారు. జిల్లాలో ప్రాణనష్టం లేదని, ఎవ్వరూ గాయ పడలేదన్నారు. నాలుగు పశువులు చనిపోయాయని, 18 ఇళ్లు దెబ్బతిన్నాయని, 9298.64 హెక్టార్లల్లో పంట నష్టం జరిగిందని ప్రాథమికంగా గుర్తించామన్నారు. పునరావాస కేంద్రాలలో తుఫాన్ బాధితులకు ఇంతవరకు 30 టన్నుల బియ్యం, మూడు టన్నుల కాయగూరలతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారన్నారు. 148 వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్డీవోలు అచ్యుత్ అంబరీష్, రమణ పాల్గొన్నారు. కాగా రానున్న రెండు రోజుల్లో జిల్లా అంతటా పెద్దఎత్తున పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం తుఫాన్ అనంతరం పారిశుధ్య, సహాయక కార్యక్రమాలు, నష్ట నివారణ అంచనాలపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

జిల్లాలో వర్షపాతం వివరాలు

గత 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా ద్వారకాతిరుమల మండలంలో 70.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 31.3 మి.మీగా నమో దైంది. పెదవేగి 59.6, ముసునూరు 59.4, కామవరపుకోట 57, నూజివీడు 40.8, టి.నరసాపురం, పెదపాడు 37.6, పోలవరం 37.2, ఆగిరిపల్లి 36.4, కైకలూరు 35, లింగ పాలెం 34.2, జంగారెడ్డిగూడెం 33, చాట్రాయి 30.8, మండ వల్లి 29.8, చింతలపూడి 27.6, ఏలూరు అర్బన్, దెందు లూరులో 25.8, కలిందిండి 25.4, భీమడోలు 25, నిడమర్రు 23.6, ముదినేపల్లి 22.4, ఉంగుటూరు 21.2, ఏలూరు రూర ల్ 19.6, బుట్టాయిగూడెం 17.8, కొయ్యలగూడెం 17.4, జీలుగుమిల్లి 14, వేలేరుపాడు 6.8, కుక్కునూరు 6.2 మి.మీ నమోదైంది. కాగా బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు 11 మండలాల్లో మొత్తం 46.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా ఇందులో అత్యధికంగా జీలుగుమిల్లి మండలంలో 17.8 మి.మీ, చింతలపూడి 10.4 మి.మీ, టి.నరసాపురం 5 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగిలిన 8 మండలాల్లో 5 మి.మీ కన్నా తక్కువగానే వర్షపాతం నమోదైంది.

పెరుగుతున్న కొల్లేరు

కైకలూరు/మండవల్లి : తుపాను ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు కొల్లేరు నీటి ప్రవాహ ఉధృతి పెరిగింది. ఇప్పటికే పెద్దఎడ్లగాడి - పెనుమాకలంక ఆర్అండ్‌బీ రోడ్డుపై మూడు అడుగులు నీరు ప్రవహిస్తుండగా లంక గ్రామాలకు రాక పోకలు స్తంభించాయి. పెద్దఎడ్లగాడి నుంచి పెనుమాకలంక, నందిగామలంక తదితర లంక గ్రామాలకు పడవల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. కైకలూరు మండలంలో కొల్లేరు ఉధృతి క్రమేణ పెరుగుతోంది. ఎగువ నుంచి వర్షపునీరు 64 మేజర్, మైనర్ డ్రెయిన్ల ద్వారా చేరుతోంది. గోకర్ణపురం-పైడిచింతపాడు రహదారి రెండుచోట్ల ముంపుబారిన పడింది.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	


విశ్వనాద్రిపాలెంలో నేలమట్టమైన వరిపైరు


ఆలపాడులో జాతీయ రహదారిపై కూలిన చెట్టు


గుడిపాడులో నేలకు ఒరిగిన వరిపంట


పెదగొన్నూరు హైస్కూల్‌పై కూలిన వృక్షం

మొంథా బీభత్సం

» కూలిన చెట్లు, ఒరిగిన విద్యుత్ స్తంభాలు » పంటలకు అపార నష్టం


లాల్వ డ్రెయిన్‌పై కూలిన వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కామినేని

మొంథా తుపాన్ ప్రభావంతో వీచిన ఈదురుగాలులు, వర్షాలకు గ్రామాల్లో అనేక చెట్లు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పంటలు నేలకొరిగాయి. అధికారుల అప్రమత్తతతో ఎక్కడా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. నష్టం అంచనాలో అధికారులు తలమునకలయ్యారు.

కైకలూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మంగళవారం రాత్రి కూలిన చెట్లను ఎక్కడికక్కడే ఆయా గ్రామాల్లోని పంచాయతీ, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపకశాఖ అధికారులు యంత్రాల సహాయంతో నరికి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు. రాత్రి సమయాల్లో పడిన చెట్లను టార్చిలైట్ల సహాయంతో తొలగించారు. అత్యధికంగా కైకలూరు మండలంలో వేమవరప్పాడు గ్రామంలో చెట్లు ఎక్కువగా విరిగిపడ్డాయి. ఆలపాడు, పల్లెవాడ గ్రామాల్లో జాతీయ రహదారిపై చెట్లు కూలిపోవడంతో కైకలూరు రూరల్ ఎస్సై వి. రాంబాబు ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు యుద్ధప్రాతిపాదికన తొల గించారు. అగ్రహారం, వదర్లపాడు, సీతనపల్లి, దొడ్డిపట్ల, తామరకొల్లు, పందిరిపల్లిగూడెం తదితర గ్రామాల్లో చెట్లు విరిగిపడ్డాయి. ఈదురుగాలులకు చెట్లు విరిగిపడి అనేకచోట్ల సుమారు 15 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. కొన్ని గ్రామాల్లో అప్పటికప్పుడే విద్యుత్ అధికారులు నూతనంగా స్తంభాలను ఏర్పాటుచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కొన్ని గ్రామాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అయితే విద్యుత్ అధికారులు అంచెలంచెలుగా లైన్లు మరమ్మతులు నిర్వహించి విద్యుత్ సరఫరా చేశారు. కైకలూరు మండలంలో సుమారు 200 ఎకరాల్లో వరిపంట దెబ్బతింది. ఈదురు గాలులకు పంటలు నేలకొరిగాయి. వింజరం, ఆనందరావు పేట, ఆచవరం గ్రామాల్లో పంటపొలాలు నేలకొరిగి నీట మునిగాయి. దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖాధికారిణి ఆర్. దివ్య పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పడిపోయిన పంటను నిలబెట్టి కట్టలు కట్టాలని సూచించారు.

మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో చెట్లు విరిగిపడగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ముఖ్యంగా మొకాసాకలవపూడి రోడ్డులో భారీవృక్షం పడిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, పోలీసు సిబ్బంది వృక్షాలను తొలగించారు. అప్పాపురం రోడ్డులో తీవ్రమైన ఈదురుగాలులకు విరిగిపడిన చెట్లను తొలగించారు. పదుల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయని వీటిని సరిచేసి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నట్లు ఏఈ రామకృష్ణ తెలిపారు.

ముదినేపల్లి: మొంథా తుపాను ప్రభావంతో వీచిన ఈదురు గాలులు ప్రజలను భయకంపితులను చేశాయి. మండలంలోని సార్వావరి పంటకు తీవ్ర నష్టం కలిగించింది. సుమారు 6 వేల ఎకరాల్లోని వరిపైరు నేల కొరిగినట్లు సమాచారం. మరో పది రోజుల్లో కోతలకు సిద్ధంగా ఉన్న గ్రామాల్లోని వరిపైరు నేల మట్టం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కొనసాగుతున్నందున నేల కొరిగిన వరిపైరును రక్షించుకునేందుకు రైతులకు సాధ్యం కావడం లేదు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో ముంపు పెరుగుతూనే ఉంది. మైనర్ డ్రైన్లలో నీటి ప్రవాహం స్తంభించిపోవడంతో పొలాల నుంచి నీరు కదలటం లేదు. మండలంలోని చిగురు కోట, పెదకామనపూడి, పెదగొన్నూరు, బొమ్మినంపాడు, విశ్వనాద్రిపాలెం, కొరగుంటపాలెం, దేవపూడి, కాకరవాడ తదితర గ్రామాల్లోని ఆయకట్టులో కోతకు సిద్ధమైన వరిపైరు నేల మట్టం కావడం అపార నష్టం సంభవించింది.

కలిదిండి: సుమారు 500 ఎకరాలో వరి పైరు నేలవాలింది. కోరుకొల్లు, సానారుద్రవరం, గోపాలపురం, వెంకటాపురం గ్రామాల్లో 20 రోజుల్లో చేతికి వచ్చే వరి పంట నేలకొరగటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కోరుకొల్లు, సానారుద్రవరం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఏడీ పార్వతి, మండల వ్యవసాయాదికారి విద్యాసాగర్ నేలవాలిన వరి పైరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈదురుగాలులకు పలు గ్రామాల్లో భారీ వృక్షాలు విద్యుత్ స్తంభాలు విరిగి పడిపోయాయి. విద్యుత్ తీగలపై చెట్లు పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మంగళవారం రాత్రంతా గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. విద్యుత్ శాఖ ఏడీఈ బి.రామయ్య ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ సిబ్బంది తీవ్రంగా శ్రమించి బుధవారం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కలిదిండి, గుర్వాయి పాలెం, కోరుకొల్లు, పడమటిపాలెంలో కూలిన భారీ వృక్షాలను ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. భీమవరం - గుడివాడ రహదారిపై రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు.

నూజివీడు టౌన్: మొంథా ప్రభావం అంతగా లేనప్పటికీ తుఫాన్‌కు ముందే కురిసిన భారీ వర్షాలకు నూజివీడు నియోజకవర్గంలో అత్యధికంగా సాగులో ఉన్న మినుము పంట వర్షానికి తడిచి మొలకలు వచ్చి రైతులు నష్టపోయారు. నియోజకవర్గంలో సుమారు 4 వేల ఎకరాల్లో మినుము పంట నష్టపోగా సుమారు 200 ఎకరాల్లో వరి, మరో 150 ఎకరాల్లో కూరగాయలు పంటలకు నష్టం వాటిల్లినట్లు అంచనా. నూజివీడు మండలంలో 420 హెక్టార్‌లలో మినుము, మరో 20 హెక్టార్లు వరి పంట నేలవాలి రైతులు నష్టపోయారు.

ముసునూరు: మండలంలోని ముసునూరు, గుడిపాడు, చెక్కపల్లి, యల్లాపురం, చింతలవల్లి, వలసపల్లి తదితర గ్రామాల్లో ఈదురుగాలులకు వరిపంట నేలకొరిగింది. పొలాల్లో నీరు ఉండటంతో ధాన్యం మొలకలు వస్తాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీతకు వచ్చిన పత్తి సైతం తడిచి ముద్దయింది. తడిచిన పత్తి రంగుమారి, చెట్టులో ఉండగానే మొలకలు వచ్చే అవకాశం ఉందని, నష్టం తప్పదని రైతులు చెబుతున్నారు. అలాగే మినుము పంటలు సైతం వరదముప్పులో చిక్కుకుని నష్టం వాటిల్లిందని రైతులు పేర్కొంటున్నారు. వలసపల్లిలో సూమారు 200 ఎకరాల్లో మిరప పంటలు పూత, పిందె దశలో నేలకువాలిపోయి నష్టం చేకూరిందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు. కాగా ప్రభుత్వ ఆదేశాల తో వ్యవసాయ అధికారులు, సిబ్బంది బుధవారం క్షేత్రస్థాయిలో పంట నష్టాలను అంచనా వేస్తున్నారు. త్వరలో సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఎ. చాముండేశ్వరి తెలిపారు.


పెరికేగూడెం వద్ద పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ

ముదినేపల్లి మండలంలో..

కూలిన చెట్లు 103.. విరిగిన స్తంభాలు 40

ముదినేపల్లి: మొంథా తుపాను ముదినేపల్లి మండలంలో బీభత్సం సృష్టించింది. మంగళవారం రాత్రి నుంచి వీస్తున్న పెనుగాలులకు గ్రామీణ ప్రాంతాలు చిన్నాభిన్నమయ్యాయి. ముదినేపల్లి - భీమవరం స్టేట్ హైవేలో భారీ ఎత్తున చెట్లు కూలిపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. బుధవారం ఉదయం వీచిన గాలులకు మండలంలోని పలు గ్రామాల్లో చెట్లు కూలి గృహాల మీద పడ్డాయి. పెదగొన్నూరు హైస్కూల్ భవనంపై పెద్దవృక్షం కూలగా కొంత మేరకు నష్టం జరిగింది. గడిచిన 24 గంటల్లో తుపాను ప్రభావంతో మండలంలో 103 చెట్లు కూలిపోయినట్లు తహసీల్దార్ లతీఫ్ పాషా తెలిపారు. ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు పోలీస్, అగ్నిమాపక దళ సిబ్బంది రోడ్లపై కూలిన చెట్ల తొలగింపు పనులు నిర్వహించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేస్తున్నారు. గాలులకు ముదినేపల్లి మండలంలో సుమారు 40 విద్యుత్ స్తంభాలు విరిగి కూలిపోగా, వైర్లు తెగిపోయాయి. మరో 50 చోట్ల స్తంభాలు ఒరిగిపోయాయి. దీంతో విద్యుత్ శాఖకు సుమారు 6 లక్షల నష్టం కలిగింది. విద్యుత్ ఏఈ పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తున్నారు.

దెబ్బతిన్న పంటను పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి



నూజివీడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో నూజివీడు మండలంలో దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి షేక్ హబీబ్ బాషా బుధవారం పరిశీలించారు. నూజివీడు మండలం మీర్జాపురం, మర్రిబంధం, గొల్లపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న మినుము, వరి పంటలను మండల వ్యవసాయశాఖ అధికారి చెన్నారావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టాన్ని ప్రాథమిక అంచనా వేశామని, 33శాతం కన్నా ఎక్కువ నష్టం వాటిల్లిన ప్రతిపంటను క్షేత్రస్థాయిలో రైతుసేవా కేంద్రం సిబ్బంది పరిశీలించి పంటనష్టం నమోదు చేస్తారన్నారు. పడిపోయిన వరిపంటను నిలబెట్టి కట్టలను కట్టుకోవడంతో పాటు గింజ మొలకెత్తకుండా ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేసుకుని నష్ట నివారణ చర్యలు చేపట్టవచ్చన్నారు. ఆర్.ఎస్.కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అప్రమత్తత వల్లే తప్పిన ముప్పు

» ఎమ్మెల్యే కామినేని » బాధితులకు పరామర్శ


భైరవపట్నంలో పిట్టలోళ్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు/మండవల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రజలకు ఎలాంటి హాని జరగకుండా మొంథా తుపాన్ నుంచి గట్టెక్కామని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం కైకలూరు మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటుచేసిన పునరవాస కేంద్రాన్ని పరిశీలించారు. మండవల్లి మండలం భైరవపట్నంలో పిట్టలోళ్లతో మాట్లాడి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విపత్కర పరిస్థితుల్లో పార్టీలకతీతంగా స్వచ్ఛందంగా దాతలు ముందుకొచ్చి ప్రజలకు సహాయసహకారాలు అందించాలన్నారు. పునరావాస కేంద్రంలో ఉండే ప్రజలకు ప్రభుత్వం నుంచి వచ్చే సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని సూచించారు. పంటనష్టాలను అంచనా వేసి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటానన్నారు ఎంపీపీ అడవి కృష్ణ, డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పూల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక వంతెన ఏర్పాటు చేయండి

కలిదిండి: లాల్వా డ్రెయిన్‌పై ఇనుప గడ్డర్లతో తాత్కాలిక వంతెన ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. బుధవారం కలిదిండిలో లాల్వ డ్రెయిన్ పై కూలిన వంతెనను పరిశీలించారు. లాల్వ డ్రెయిన్‌లో వరద ఉధృతి తగ్గిన వెంటనే ఇనుప గడ్డర్లతో తాత్కాలిక వంతెన ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్‌ను ఫోన్‌లో కోరారు. తొలుత పడమటిపాలెం బంకు కాలనీ, కలిదిండి పునరావాస కేంద్రంలో ఉంటున్న వరద బాధితుల పరామర్శించారు.

రైతులు అధైర్య పడవద్దు: జయమంగళ

మండవల్లి: నష్టపోయిన రైతులు ఆధైర్యపడొద్దని కూటమి ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పేర్కొన్నారు. మండవల్లి మండలం అల్లినగరం పెరికేగూడెం గ్రామాల్లో పడిపోయిన పంటపొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించేలా ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో కలిసి కృషి చేస్తామని తెలిపారు. ఏవో శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: మండలంలో వరి పంట నష్టాన్ని బుధవారం ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ పరిశీలించారు. మండలంలోని సంకర్షణపురం, పెనుమల్లి, గురజ గ్రామాల్లో నేల కొరిగిన వరి పైరును చూసి బాధిత రైతులకు ప్రభుత్వం బాసటగా నిలుస్తుందని, అధైర్యపడవద్దని ఆయన తెలిపార పెనుమల్లి సర్పంచ్ జంగం వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు అడుసుమిల్లి రాము, చెన్నంశెట్టి నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతును ఆదుకుంటాం : నాదెండ్ల


ఏపూరు పునరావాస కేంద్రంలో బాధితులకు నిత్యావసరాల పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల

ఏలూరు/పెదపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో మొంథా తుఫాన్ నేపథ్యంలో 90 పునరావాస కేంద్రాలకు 3,422 మంది తరలించి సహాయక చర్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాం. జిల్లా యంత్రాంగం తీసుకున్న ముందస్తు చర్యలు వల్ల తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నాం. విపత్తు నివారణకు యంత్రాంగం మనస్సు పెట్టి చేసింది' అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఏలూరు జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలపై బుధవా రం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని 408 గ్రామ, వార్డు సచివాలయాల్లోని సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని ముందస్తు చర్యలు తీసుకుందన్నారు. తుఫాన్ బాధితులు సహాయ కేంద్రం నుంచి వెళ్లే సమయంలో కుటుంబానికి 25 కేజీల బియ్యం, కందిపప్పు, పంచదార, వంటనూనె, రెండు రకాల కూరగాయలు కిలో చొప్పున అందిస్తామన్నారు. చేనేత కార్మికులు, మత్స్యకార కుటుంబాలకు అదనంగా 25 కేజీల బియ్యం అందిస్తామన్నారు.

నష్టాలపై 30లోగా నివేదిక అందించండి..

జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధకశాఖ, ఆక్వా రంగానికి కలిగిన నష్టాలపై ఈనెల 30 తేదీలోగా నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించామన్నారు. కలెక్టర్ వెట్రి సెల్వి, ఉంగుటూరు ఎమ్మెల్యే దర్మరాజు, ఆర్టీసీ చైర్మన్ రీజనల్ చైర్మన్ అప్పలనాయుడు, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఏపూరు పునరావాస కేంద్రం సందర్శన..

పెదపాడు మండలం ఏపూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి బుధవారం ఆయన సందర్శించారు. ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ శివారు ప్రాంతాల్లో రేకులషెడ్లు, పూరిపాకల్లో నివసిస్తున్న 32 కుటుం బాలకు చెందిన 96 మందిని పునరావాస కేంద్రానికి తరలించి వసతి, భోజన ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం పునరావాస కేంద్రాల నుంచి తిరిగి ఇంటికి వెళ్లే కుటుంబాలకు 25 కేజీలు బియ్యం, నిత్యావసర సరుకులు, బాధిత మనిషికి రూ.వెయ్యి, కుటుంబానికి రూ.3 వేలు చొప్పున నగదు పరిహారాన్ని అందజేశారు. ఆర్డీవో అచ్యుత అంబరీష్, డీఎస్‌వో విలియమ్స్, జిల్లా వ్యవసాయశాఖ జేడీ షేక్ హబీబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతుల్ని ఆదుకుంటాం...

తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులందరిని ఆదుకుంటామని మంత్రి మనోహర్ తెలిపారు. తుఫాన్ ప్రభా వంతో నష్టపోయిన పంటలను పెదపాడు మండలం వట్లూరులో బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులు వరి దుబ్బులను చూపించి ఆదుకోవాలని కోరగా మంత్రి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు.

అధికారులతో మంత్రి సమీక్ష

ఏలూరు సిటీ : ఏలూరు జిల్లాలో నిర్వహించిన తుఫాన్ సహాయక కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి, తుఫాను సహాయక కార్యక్రమాల జిల్లా ప్రత్యేకాధికారి కాంతిలాల్ దండే, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారు లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభు త్వ యంత్రాంగం తీసుకున్న ముందస్తు జాగ్రత్త చర్యలతో మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కో గలిగామన్నారు. జిల్లా మంత్రి పార్థసారథి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీ నేతలు క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారని, వీటిని అధికారులు పరిష్కరించడంతో నష్టాన్ని నివారించగలిగామన్నారు. జిల్లా ప్రత్యేకాధికారి కాంతిలాల్ దండే మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం ముందస్తు జాగ్రత్తలతో నష్టాల ను తగ్గించగలిగామని అధికారులను అభినందించారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మంత్రులు, ప్రజాప్రతినిధులు, తుఫాన్ ప్రత్యేకాధికారులు అందించిన సూచనలతో తుఫాన్‌కు ముందుగానే ప్రజలను సహాయక కేంద్రాలకు తరలించడంతో ప్రాణనష్టం సంభవించలేదన్నారు.

యోగాలో ఆగిరిపల్లి టీం ప్రతిభ

ఆగిరిపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ఆగిరిపల్లి మండలం శోభనాపురం, వడ్లమాను, ఆగిరిపల్లి గ్రామాలకు చెందిన యోగా సాధకులు పాల్గొన్నట్లు ఏలూరు జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొద్దూరు సాంబశివరావు తెలిపారు. మహిళల విభాగంలో బొద్దూరు పద్మశ్రీలత 3వ స్థానం సాధించగా, పురుషుల విభాగంలో పత్రి కనకభూషణం మూడో స్థానం, 6వ స్థానంలో టి. ప్రసన్న సాయి, 7వ స్థానంలో కే శ్రీనివాసరావు, 8వ స్థానంలో ఎం. జ్యోతికుమారి, 9వ స్థానంలో యండూరు నరసింహమూర్తి, 10వ స్థానంలో భావన నిలిచారు. ముఖ్యఅతిథులు షీల్డ్స్, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఎల్ఆర్ఎస్‌కు పచ్చజెండా

(5వ పేజీ తరువాయి)

దాని అసలు విలువపై ఓపెన్ స్పేస్ ఛార్జీల కింద 10 శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఎల్ఆర్ఎస్ వల్ల చట్టబద్ధ భవన అనుమతులు, ఆధునిక వసతులు (నీరు, విద్యుత్, డ్రెయినేజీ) సౌకర్యాలు పొందవచ్చు. భవిష్యత్‌లో న్యాయబద్ధమైన లావాదేవీలతో పాటు చట్టపరమైన భద్రత కలిగి ఉండవచ్చు. ఇడా పరిధిలో అయితే హెల్ప్‌డెస్ ఫోన్ నంబర్ 99668 48055లో సంప్రదించవచ్చు.

అర్హతా ప్రమాణాలు

- క్రమబద్ధీకరణకు జూన్ 30,2025లోగా రిజిస్టర్ కాబడిన అనధికార ప్లాట్లు/ లే-అవుట్లకు వర్తిస్తాయి.
- కనీసం ఒక ప్లాట్ అమ్మకం ఈ తేదీకి ముందుగా జరిగి ఉండాలి
- ప్లాట్ అనధికారిక లే-అవుట్‌లో భాగంగా ఉండాలి.


చాట్రాయి-నరసాపురం రహదారిపై భారీ గుంత

ఎంత పెద్ద గొయ్యో..

చాట్రాయి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విస్సన్నపేట-వెలగలపల్లి ఆర్అండ్‌బీ రహదారి (వీవీ రోడ్డు) పరిధిలో చాట్రాయి- నరసాపురం గ్రామాల మధ్య చింత కొయ్య వాగు వద్ద రహదారిపై ఏర్పడిన భారీ గుంత వాహన చోదకులను భయపెడుతోంది. వ్యవసాయ భూముల నుంచి వస్తున్న వర్షం నీరు ఇక్కడ రహదారిపై నిలిచిపోతుండటం, వాహనాల తాకిడితో రోడ్డు ధ్వంసమై భారీ గుంత ఏర్పడింది. ఇది రోజురోజుకి పెద్దదవుతోంది. వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనచోదకులు గోతిలో పడి గాయపడుతున్నారు. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి ఈ భారీ గుంతను పూడ్చాలని వాహన చోదకులు కోరుతున్నారు.